V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
16-07-2024

సంపుటి : 01 | సంచిక : 73 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ CMD

## కారులో తిప్పుతూ మహిళపై అత్యాచారం


- హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన మరో నిర్భయ ఘటన
- గృహ హింసపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మహిళ
- ఆమె నిస్సహాయతను క్యాష్ చేసుకున్న ఆటో డ్రైవర్
- స్నేహితులతో కలిసి కదులుతున్న కారులో అత్యాచారం
- హైదరాబాద్ నగర వీధుల్లోనే అఘాయిత్యం
- అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన


2

## డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ రకుల్ ప్రీత్‌సింగ్ తమ్ముడు

- మరో ఐదుగురు నైజీరియన్లను అరెస్ట్
- 200 గ్రాముల కొకైన్ స్వాధీనం
- పరారీలో కీలకసూత్రధారి నైజీరియన్
- వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్


2



# రైతు రుణమాఫీ మార్గదర్శకాలు రిలీజ్

ప్రతి రైతు కుటుంబానికి రూ.2.00 లక్షల రుణమాఫీ

"తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించిన సర్కార్.. సోమవారం రైతులకు సంబంధించిన రూ.2 లక్షల పంట రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రుణగ్రహీతలకు వర్తింపు
- రూ.2 లక్షల మేర అసలు, వడ్డీ చెల్లింపు
- రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం
- ఎస్‌హెచ్‌జీలు, జేఎల్‌జీలు, ఆర్ఎంజీలు, ఎల్ఈసీఎస్లకు వర్తించని రుణమాఫీ
- పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూలు చేసిన రుణాలకు వర్తించదు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ

**విశ్వంభర, హైదరాబాద్ :**
"వ్యవసాయాన్ని లాభసాటిగా, స్థిరంగా కొనసాగేలా చేయటానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి వుంది. తెలంగాణ ఆర్థిక వృద్ధికి వ్యవసాయ రంగం ఒక కీలకమైన పునాది. వ్యవసాయ, అనుబంధ రంగాలు తెలంగాణ గ్రామీణ జనాభాలో 66 శాతం మందికి ఉపాధిని సమకూర్చుతూ జీఎస్ డిపికి 15.8 శాతం తోడ్పాటును అందిస్తుంది (డిఇఎస్ డేటా ప్రకారం 20232024 ఎఇ). అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అత్యవసరం. తెలంగాణ రైతులలో చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో వున్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడానికి, వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి, పంటరుణాల మాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించింది. పంట రుణమాఫీ రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించి, వారు బ్యాంకుల నుండి తక్కువ వడ్డీపై కొత్త రుణాలు తీసుకోవడానికి మరియు అధిక వడ్డీపై బయట రుణాలు తీసుకోకుండా ఉపయోగపడుతుంది. తద్వారా, అత్యవసర వ్యవసాయ ఇన్ పుట్ లు కొనుక్కోవడానికి అవకాశం కలుగచేస్తుంది. అధిక వడ్డీ రేట్ల ద్వారా తీవ్రతరం అయ్యే శాశ్వత

మిగతా3లో...

## హరీష్ రావుతో ఏక్ నాథ్ షిండే ప్రయోగం

- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాకపోతే జరిగేది ఇదే..
- హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు


2

## రుణమాఫీలో నాలుక మడతేసిన రేవంత్

- అవి మార్గదర్శకాలు కాదు.. మభ్యపెట్టే ప్రయత్నాలు
- హామీ ఇచ్చేటప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడెందుకు..?
- రేషన్ కార్డు లేని రైతుల పరిస్థితి ఏంటి..?
- రుణమాఫీ లక్ష్యానికి గండికొడుతున్నారు
- మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అభ్యంతరం


2


2

## కారు దిగి చెయ్యి అందుకున్న గూడెం

- కాంగ్రెస్ పార్టీలో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- గాలి అనిల్‌తోపాటు కార్పొరేటర్లు, అనుచరులు చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో 10కి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య

## కేసీఆర్ పిటిషన్ పై విచారణ వాయిదా

సుప్రీంకోర్టు తీర్పు పై తీవ్ర ఉత్కంఠ

జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ని వ్యతిరేకిస్తూ పిటిషన్

కోర్టు సమయం ముగియడంతో నేటికి వాయిదా

**విశ్వంభర, ఢిల్లీ:** ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోళ్లతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నర్సింహా రెడ్డి కమిషన్ విచారణ

మిగతా2లో...





## కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఐఏఎస్‌ల విచారణ

- 10 మందికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు
- వారం రోజుల్లో అఫిడవిట్ రూపంలో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- విచారణకు హాజరైన స్మితాసబర్వాల్, రజత్ కుమార్, వికాస్ రాజ్

2

## రుణమాఫీపై ఇన్ని కండీషన్లా?

- ఎటువంటి కండిషన్ లేకుండా రుణ మాఫీ చేస్తామన్న హామీ ఏమైంది?
- రేషన్ కార్డు కండిషన్ పెట్టి చాలా మందికి ఎగొట్టే ప్రయత్నం
- కండీషన్లు పెట్టడం సరైన పద్ధతి కాదు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి


2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 108 | ₹ 131 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 190 | ₹ 216 |

## రైతుల ఆశలపై నీళ్లు చల్లిన రుణమాఫీ

- ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అంటే ఎలా..?
- రైతుకు రుణభారం తగ్గించే ప్రయత్నం కాదు..
- ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయత్నమే ఇది
- 2018, డిసెంబర్ 12 ముందున్న రైతులకు వర్తించదపడం అసమంజసం
- రుణమాఫీ మార్గదర్శకాలపై హరీష్ రావు ఆగ్రహం


2



## బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రణాళిక

- పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, పెంపుపై చర్చ
- కుల గణన ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది?
- పంచాయతీ ఎన్నికలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు

మిగతా2లో...

# రుణమాఫీలో నాలుక మడతేసిన రేవంత్

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ మార్గదర్శకాలపై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. అవి మార్గదర్శకాలు కాదు... మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప..రైతాంగం బాగుండాలి ..వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదన్న రేవంత్... ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ప్రామాణికంగా తెలంగాణలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మార్గదర్శకాల్లో మెన్షన్ చేయడాన్ని తప్పుబట్టారు.



**రుణమాఫీ లక్ష్యానికి గండికొడుతున్నారు...**

తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షల పైచిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపింది. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు.. ఈరోజు కొందరికే పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారని నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు.. రేషన్ కార్డు, పీఎం కిసాన్ డాటా వంటివి పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. అసలు రాష్ట్రంలో రూ. 2 లక్షల రుణం పొందిన రైతులు ఎంత మంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటాం అని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదు.. అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టం అయినవి. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమే.. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు..అమలు చేసేటప్పుడు ఎందుకు? మరి ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లు? నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండి వెంటనే రుణమాఫీ చేస్తాం అని రైతులను పరుగులు పెట్టించి నేడు కాంగ్రెస్ నేతలు చావు కబురు చల్లగా చెబుతున్నారని మాజీ మంత్రి ఆరోపించారు.

**రేషన్ కార్డు లేని రైతుల పరిస్థితి ఏంటి?**

తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్ ఇటీవలే ప్రకటించాడు.. సరిగ్గా నాలుగు రోజులు తిరగక ముందే నాలుక మడతేశాడని నిరంజన్ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వాలు కేవలం కుటుంబాలను గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డులను పరిశీలించేవారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పది ఎకరాలుండి పింక్ కార్డులు ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తించదా? అని ఆయన ప్రశ్నించారు. రేషన్ కార్డు ప్రామాణికం అని చెప్పినప్పుడు... రేషన్ కార్డులు లేని రైతుల పరిస్థితి ఏంటి? అని నిలదీశారు. రుణమాఫీపై రైతుల నుండి ఫిర్యాదులను కోరడం అంటే రైతుల మధ్య వివాదాలను సృష్టించడమే అన్నారు. ఎన్నికల్లో ఆశ చూపి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్.. అధికారం వచ్చాక హామీల నుండి తప్పించుకునేందుకు సాకులు వెతుకుతుందన్నారు. పీఎం కిసాన్ డాటా ఉంటే మళ్లీ రుణమాఫీ అమలుకు వ్యవసాయ అధికారులను బాధ్యులను చేయడం ఎందుకు? రైతుల నుండి ఫిర్యాదులు ఆహ్వానించడం ఎందుకు? తెల్ల రేషన్ కార్డు ప్రామాణికత ఎందుకు? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వానికి రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లేకనే గందరగోళంగా రుణమాఫీ మార్గదర్శకాలు నిర్ణయించిందన్నారు. అధికారులు, రైతుల మధ్య ఈ మార్గదర్శకాలు చిచ్చుపెట్టేలా ఉన్నాయన్నారు. ఈ విధానం మూలంగా అధికారుల మీద రాజకీయ వత్తిళ్లు పెరుగుతాయన్నారు. కాంగ్రెస్ మోసాలకు భవిష్యత్‌లో కర్షకులు గుణపాఠం చెబుతారని మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

సన్నద్ధమవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు.



**రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ**

బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.


**కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలపై అధ్యయనం**

ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్ తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మారోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై నడవగలవు.. చెట్లు ఎక్కగలవు!

- మహబూబ్‌నగర్ జిల్లా వింత చేపలు ప్రత్యక్షం
- పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట దారిలో చేపల వాకింగ్
- ఆశ్చర్యంతో గ్రామాల నుంచి తరలివచ్చి చూసిన జనం
- గురక చేపలని తేల్చేసిన మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప
- ఆంధ్రప్రదేశ్‌లో ఆహారపు చేపగా పెంచుతారని వెల్లడి

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తగా వానలు విస్తారంగా కురుస్తున్నాయి. వానలకు పాములు, చేపలు, కప్పలు రోడ్డపై ప్రత్యక్షమవడం సాధారణమే. గతంలో పలుమార్లు చేపల వానలు కూడా కురిశాయి. అయితే తాజాగా కురిసిన వానలకు రోడ్డుపై రెండు వింత చేపలు కనిపించాయి. మామూలుగా



చేపలు నీళ్లలో ఈదుతాయి. ఒడ్డునవేస్తే గిలగిల కొట్టుకుంటాయి. అయితే ఈ చేపలు ఈ రెండూ చేయలేదు. పాములు మాదిరి చక్కగా పాకుకుంటూ ఎంత దూరమైనా వెళ్తున్నాయి.. అంతేనా.. ఏకంగా చెట్లు కూడా ఎక్కేస్తాయట. ఈ విచిత్ర ఘటన మహబూబ్‌నగర్ జిల్లా పెంట్లవెల్లి మండలంలో చోటుచేసుకుంది.

**చేపల తలకు ఇరువైపుల మొప్ప కుహరంపై రంపం వంటి పళ్లు**

పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట వెళ్లే దారిలో ఈ చేపలు కనిపించాయి. ఈ చేపలను చూడటానికి ప్రజలు, రైతులు గుంపులుగా వచ్చారు. చేపలు పాకుతూకుంటూ రోడ్డుపై పోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో ఈ విచిత్ర చేపలను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. చేపల వింత ప్రవర్తన గురించి మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్పను వివరణ కోరగా.. ఈ రకం చేప నదులు, చెరువులు, కుంటలు, వాగుల్లో జీవిస్తుందని తెలిపారు. ఈ చేపను గురక చేప (ఎక్కే చేప) అని అంటారని అన్నారు. దీని శాస్త్రీయ నామం అనబాస్ టెస్టుడ్యూనియస్. సుమారు 25 సెంటీమీటర్ల వరకు పెరుగుతుందని తెలిపారు. ఈ విధమైన చేపల తలకు ఇరువైపులా ఉన్న మొప్ప కుహరంపై రంపం వంటి పళ్లు ఉంటాయి. వీటి ద్వారా నేలపై పాకుతూ వెళ్తాయి. మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే.. ఇవి చెట్లను కూడా సులువుగా ఎక్కేస్తాయట. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మత్స్యకారులు ఆహారపు చేపగా చెరువుల్లో ప్రత్యేకంగా వీటిని సాగు చేస్తుంటారని ఆయన పేర్కొన్నారు.

# కుల గణన పై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాము

## మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇవాళ కరీంనగర్ లో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో ప్రభుత్వాలను కూల్చిన బీజేపీకి ఫిరాయింపులపై మాట్లాడే అర్హత లేదని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, మాజీ మంత్రి కేటీఆర్ తీరు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను చేర్చుకోవడంలో తాము ధర్మం తప్పలేదని అన్నారు. డిసెంబర్ 3 వరకు ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్న ఆలోచనే తమకు లేదని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటే..నిలబెట్టడానికి వారు వస్తున్నారని మంత్రి పొన్నం అన్నారు. ప్రభుత్వ సుస్థిరత కోసమే ఈ చేరికలు అని ఆయన తెలిపారు. కుల గణన పై 2 రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.



# కారులో తిప్పుతూ మహిళపై అత్యాచారం

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో మరో నిర్భయ ఘటన కలకలం రేపుతోంది. కదులుతున్న కారులో మహిళపై జరిగిన అత్యాచార ఘటన అందరినీ ఉలిక్కిపడేలా చేస్తోంది. తనపై జరుగుతోన్న గృహహింస గురించి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ కి వెళ్లిన మహిళ మరో కేసులో బాధితురాలయ్యింది. తన నిస్సహాయతను ఆసరాగా తీసుకున్న ఆటో డ్రైవర్, అతడి బ్యాచ్ ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వార్త రాష్ట్రంలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే.. 29 ఏళ్ళ మహిళ తనపై జరుగుతోన్న గృహహింస గురించి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కి వెళ్ళింది. ఈ నెల 12 (మంగళవారం) రాత్రి యాప్రాల్ నుంచి ఉబర్ ఆటో బుక్ చేసుకుని అల్వాల్ పోలీస్ స్టేషన్ కి వెళ్ళింది. స్టేషన్ లో ఫిర్యాదు చేసి తిరిగి ఇంటికి వెళ్లేందుకు అదే ఆటోలో బయలుదేరింది.ఆమె నిస్సహాయతను గ్రహించిన ఆటో డ్రైవర్, ఎస్.శంకర్ తన ఇద్దరు స్నేహితులకు విషయం చెప్పాడు. అమానుష్య ప్రాంతానికి వెళ్లిన తర్వాత ఆమెని తన స్నేహితులతో కలిసి బెదిరించి కారులో ఎక్కించారు. తర్వాత శంకర్ వెళ్ళిపోయాడు. ఆ ఇద్దరు వ్యక్తులు తెల్లవారుజామున 2:45 గంటల వరకు సిటీ అంతా తిప్పుతూ కదులుతున్న కారులో ఆమెపై అత్యాచారం చేశారు. వారి నుండి తప్పించుకున్న బాధితురాలు రోడ్డుపైకి వచ్చి కాపాడమంటూ కేకలు వేసింది. ఓ గూడ్స్ క్యారియర్ ఆటో డ్రైవర్ ఆమెకి సాయం చేశాడు. అతని వాహనంలో సమీపంలోని వినాయకుడి గుడి వద్దకి చేరుకుంది. అక్కడ స్థానికుల సాయం తీసుకుని డయల్ 100 కి ఫోన్ చేసి తనకి జరిగిన అన్యాయం గురించి చెప్పింది. దీంతో బొల్లారం పోలీసులు వెంటనే ఆమె ఉన్నచోటుకి వెళ్లారు. ఘటనపై జీరో ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. అనంతరం కేసుని అల్వాల్ పోలీస్ స్టేషన్ కి బదిలీ చేశారు. పోలీసులు ఇప్పటి వరకు ఆటో డ్రైవర్ శంకర్ ని అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులు పట్టుబడలేదు.

# డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ రకుల్ ప్రీత్‌సింగ్ తమ్ముడు

**విశ్వంభర, హైదరాబాద్:** సైబరాబాద్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. హైదరాబాద్ మహా నగరంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, సైబరాబాద్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు కలిసి జరిపిన తనిఖీల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఈ కేసులో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ తోపాటు మరో ఐదుగురు నైజీరియన్లను అరెస్ట్ చేశారు పోలీసులు. వీరి నుంచి రూ.2 కోట్లకు పైగా విలువైన 200 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. అమన్ ప్రీత్ సింగ్ ను వినియోగదారుడిగానే విచారిస్తున్నామన్నారు. ఇప్పటివరకు డ్రగ్స్ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేశామని.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని అన్నారు. పరారీలో ఉన్నవారిలో కీలకసూత్రధారి నైజీరియన్ ఉన్నారని అన్నారు. ఓ నౌహ నైజీరియా నుంచి హైదరాబాద్ కు డ్రగ్స్ వస్తుందని.. పట్టుబడిన వారి నుంచి శాంపిల్స్ తీసుకున్నామన్నారు. 2 పాస్ పోర్టులు, 10 సెల్ ఫోన్స్, 2 బైకులు సీజన్ చేశామని తెలిపారు సీఐ శ్రీనివాస్. వీఐపీలే టార్గెట్ గా హైదరాబాద్ లో డ్రగ్స్ దందా నడుస్తున్నట్లుగా పేర్కొన్నారు. హైదర్ షా కోట్ లో రైడ్ చేసి మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశామని.. నిజానికి తమకు అందిన టిప్ మేరకు డ్రగ్స్ అమ్మేవారు కొనుగోలు చేసేవారు మీటింగ్ పెట్టుకున్నప్పుడు అరెస్ట్ చేశామని తెలిపారు.

**ఫేక్ పాస్ట్ పోర్టుతో నైజీరియా నుంచి వచ్చిన మహిళ..**

డ్రగ్స్ ను నైజీరియన్ మహిళ అనోహ బ్లెస్సింగ్ తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె ఫేక్ పాస్ట్ పోర్టుతో నైజీరియా నుంచి హైదరాబాద్ వచ్చిందని.. 2019 నుంచి డ్రగ్స్ సరాఫరా చేస్తోందని అన్నారు. ముంబై, గోవా, బెంగుళూరు ద్వారా ఆరు నెలల్లో 2.6 కిలోల కొకైన్ హైదరాబాద్ కు తీసుకొచ్చిందని.. ఈ ఆరు నెలల్లో 30 మంది వీఐపీ కస్టమర్లకు కొకైన్ సరాఫరా చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. అమన్ సింగ్ తోపాటు డ్రగ్స్ తీసుకున్న కిషన్ రాటి, అంకిత్, యశ్వంత్, రోహిత్, శ్రీ చరణ్, ప్రసాద్, హేమంత్, నిఖిల్ దావన్, మధు, రఘు కృష్ణంరాజు వెంకట్ మరో ఆరుగురుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాకో టాలీవుడ్ కొరియోగ్రాఫర్ ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ గ్యాంగ్ కు చెందిన కీలక సూత్రదారి ఏబుక సుజి పరారీలో ఉన్నారని.. అతడిపై రూ.2 లక్షల రివార్డ్ ఉందని తెలిపారు. డ్రగ్స్ తీసుకుంటున్న అయిదుగురు నుంచి శాంపిల్స్ తీసుకోగా.. అయిదుగురికి కూడా కొకైన్ పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు.

# కారు దిగి చెయ్యి అందుకున్న గూడెం

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. తాజాగా మరో ఎమ్మెల్యే గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కారు దిగి చెయ్యి అందుకున్నారు. సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గూడెం మహిపాల్ రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వెంట పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జగ్గారెడ్డి, దామోదర రాజనర్సింహా ఉన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు గాలిఅనిల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు పలువురు కార్పొరేటర్లు, అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ గూటికి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 10కి చేరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పటికే.. గ్రేటర్ పరిధిలో దానం నాగేందర్, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ కాంగ్రెస్ లో చేరగా.. తాజాగా మహిపాల్ రెడ్డి రావడంతో ఈ సంఖ్య నాలుగుకి చేరింది. అయితే.. త్వరలోనే కాంగ్రెస్‌లో మరికొందరు కూడా వస్తారని కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది.వాస్తవానికి గూడెం మహిపాల్‌రెడ్డి శనివారమే కాంగ్రెస్ లో చేరుతారని ప్రచారం జరిగింది. ఆరోజున పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకు వచ్చారు. చర్చల అనంతరం ఆయన పార్టీలో చేరకుండా తిరిగి వెళ్లారు. తాజాగా గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ లో చేరడం చర్చనీయాంశంగా మారింది. గూడెం చేరికతో హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ బలం మరింత పెరిగినట్లయింది.

# హరీష్ రావుతో ఏక్ నాథ్ షిండే ప్రయోగం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలోనూ ఏక్ నాథ్ షిండే ప్రయోగాన్ని అమలు చేయబోతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో బీఆర్ఎస్ విలీనానికి అంగీకరించకపోతే మాజీ మంత్రి హరీష్ రావును అడ్డంపెట్టుకొని భ్రష్టు రాజకీయాలు చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఆయన సోమవారం ఓ వీడియో విడుదల చేశారు.కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి



డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో కేటీఆర్, హరీష్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారని అన్నారు. హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరపున పోటీ చేయించే ఆలోచన ఉన్నదని అన్నారు.అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా సిద్దిపేటలో హరీష్‌రావు మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు.హరీశ్రావు పై వచ్చిన పొగడ్తలను బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమర్థిస్తారా..? అంటూ ఆయన ప్రశ్నించారు. ఆ నేతల వ్యాఖ్యలను వరుసగా పరిశీలిస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కైయ్యాయని స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఐఏఎస్‌ల విచారణ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పై పలువురు ఐఏఎస్ లనుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వివరణ కోరింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతోపాటు పంపుహౌసులపై విచారణ నిర్వహిస్తున్న కమిషన్ మొత్తం 10 మందికి నోటీసులు పంపంచింది. వీరిలో పలువురు రిటైర్డ్ ఐఏఎస్‌లు ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నీటిపారుదల, ఆర్థిక శాఖలలో కీలక విధులు నిర్వహించిన వారు సోమ, మంగళవారాల్లో హాజరు కావాలని సమాచారం అందించింది. దీనిపై స్పందించిన ఐఏఎస్ లు కమిషన్ విచారణకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. అయితే వారు చెప్పిన వివరాలను అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని పీసీ ఘోష్ కమిషన్ కోరింది. అఫిడవిట్‌కు వారం రోజుల గడువు ఇచ్చింది. బడ్జెట్ సెషన్స్ కారణంగా ఆ తర్వాత అఫిడవిట్ సమర్పిస్తానని ప్రస్తుత ఫైనాన్షియల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తెలుపగా.. ఆగస్టు 5 వరకు గడువిచ్చింది కమిషన్. ఈ మేరకు ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఇటీవల వరకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిగా పనిచేసి రిలీవ్ అయిన వికాస్‌రాజ్‌లు విచారణకు హాజరుకానున్నారు. పదవీ విరమణ చేసిన ఐఏఎస్‌లలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన రజత్‌కుమార్, ఎస్కే జోషి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన నాగిరెడ్డిలను కూడా పిలిచింది. ఎన్నికల అధికారిగా పనిచేసిన వికాస్‌రాజ్ గతంలో కొంతకాలం నీటిపారుదల శాఖ బాధ్యతలు నిర్వర్తించారు.

# రుణమాఫీపై ఇన్ని కండీషన్నా..?

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో ఎటువంటి కండిషన్ లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, మరి ఇప్పుడు ఇన్ని కండిషన్స్ ఎందుకు పెట్టారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రీ షెడ్యూల్ చేసిన రుణాలకు మాత్రమే రుణమాఫీ ఇస్తామని అంటున్నారని తెలిపారు. చాలా బ్యాంకులు లోన్ రికవరీ అయ్యి మళ్ళీ కొత్తగా లోన్ ఇచ్చినట్టు బ్యాంకర్లు రైతు పుస్తకాల్లో రాసుకుంటారని చెప్పారు. వాటికి వర్తించదని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. బ్యాంకర్లు చేసిన తప్పిదాలకు రైతు బలి అవుతారని, ఎందుకీ కండిషన్లని నిలదీశారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. రేషన్ కార్డు అనే కండిషన్ పెట్టి చాలా మందిని ఎగొట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఒకే రేషన్ కార్డు లో ఉన్న అన్నదమ్ములు భూములు పంచుకొని విడివిడిగా లోన్ తీసుకుంటారని అన్నారు. వారి పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. ఒక్క రేషన్ కార్డు లో నలుగురి మీద లోన్ ఉంటే ఒక్కరికే ఇవ్వడం మిగతా వారు నష్టపోతారని తెలిపారు. కుటుంబంలో ఒక్కరికి చిన్న ఉద్యోగం ఉన్న కుటుంబం మొత్తానికి తెల్ల రేషన్ కార్డు తీసేస్తారని చెప్పారు. కండీషన్లు పెట్టడం సరైన పద్ధతి కాదని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి కండిషన్ లేకుండా రుణమాఫీ చేయాలన్నారు.

# రైతుల ఆశలపై నీళ్లు చల్లిన రుణమాఫీ

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. తెలంగాణలో భూమి కలిగివున్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ వర్తిస్తుందని, ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకని సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.మార్గదర్శకాలపై హరీశ్ రావు ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. రుణమాఫీ పథకం అమలు విషయంలో విడుదల చేసిన మార్గదర్శకాల ద్వారా రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి పెట్టిందన్నదని స్పష్టమవుతోందని చెప్పారు. ఎన్నికల వేళ ఒక మాట చెప్పి, అధికారంలోకి వచ్చాక మరో మాట చెబుతున్నారని అన్నారు. చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అనే పద్ధతి చెయ్యి గుర్తు పార్టీకి అలవాటుగా మారిందని తెలిపారు. 2018, డిసెంబర్ 12 వరకు ముందున్న రైతులకు వర్తించదు అనే నిబంధన అసమంజసమని చెప్పారు. రైతుకు రుణభారం తగ్గించే ప్రయత్నం కన్నా ప్రభుత్వ భారం తగ్గించుకునే ప్రయత్నమే ఎక్కువ కనపడుతున్నదని తెలిపారు. ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడం అంటే లక్షలాది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమేనని చెప్పారు.

# కేసీఆర్ పిటిషన్ పై విచారణ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకంగా జరడగంలేదని, న్యాయసూత్రాలకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషనన్ను రద్దు చేయాలని కేసీఆర్ దేశ అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో కేసీఆర్ పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు రేపటికి వాయిదా వేసింది.కేసీఆర్ పిటీషన్ పై విచారణ జరగాల్సి ఉండగా.. కోర్టు సమయం ముగియడంతో ఈ పిటిషన్ విచారణను ధర్మాసనం రేపటికీ వాయిదా వేసింది. దీంతో కేసీఆర్ పిటిషన్ పై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందోనని స్టేట్ పాలిటిక్స్ లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాగా, జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ను రద్దు చేయాలని కోరుతూ మొదటగా కేసీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కేసీఆర్ అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు.. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ హైకోర్టులో ఊరట లభించకపోవడంతో కేసీఆర్.. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

# రైతు రుణమాఫీ మార్గదర్శకాలు రిలీజ్

(మొదటి పేజీ తరువాయి)

రుణగ్రస్థత నుండి వారిని కాపాడుతుంది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఆర్థికస్థితిని దృష్టిలో వుంచుకొని వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండేలా చూడటానికి, రాష్ట్రంలో రైతుల కోసం పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. క్షుణ్ణంగా పరిశీలించిన మీదట ప్రభుత్వం పంట రుణమాఫీ పథకం2024 అమలు కోసం ఈ మార్గదర్శకాలను నిర్ణయించింది" అని వ్యవసాయ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.



**రుణమాఫీ మార్గదర్శకాలు:**

తెలంగాణలో భూమి కలిగివున్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2.00 లక్షల వరకు పంట రుణమాఫీ వర్తిస్తుంది. ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (ఉమ్మడిగా "బ్యాంకులు" అని పిలువబడుతాయి) వాటి బ్రాంచ్ ల నుండి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 12122018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరయిన లేక రెన్యువల్ ఆయిన రుణాలకు మరియు 09122023 తేదీ నాటికి బకాయి ఉన్న పంటరుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద ప్రతి రైతుకుటుంబం, 2 లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09122023 తేదీ నాటికి బకాయి వున్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి వుంటుంది. రైతు కుటుంబం నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ వారు నిర్వహించే ఆహార భద్రత కార్డు (పిడిఎస్) డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. అట్టి కుటుంబంలో, ఇంటి యజమాని, జీవిత భాగస్వామి, పిల్లలు మున్నగు వారు ఉంటారు.

**పథకం అమలుకు ఏర్పాట్లు :**

వ్యవసాయశాఖ కమిషనర్ మరియు సంచాలకులు (డిఒఎ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేసే అధికారిగా నిర్ణయించబడింది. హైదరాబాద్ లోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) ఈ పథకానికి ఐటి భాగస్వామి బాధ్యతలు నిర్వహిస్తారు. వ్యవసాయశాఖ సంచాలకులు మరియు ఎన్ఐసి సంయుక్తంగా ఈ పథకం అమలు కోసం ఒక ఐటి పోర్టల్ ను నిర్వహిస్తారు. ఈ ఐటి పోర్టల్ లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఈ ఐటి పోర్టల్ లో ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ కి బిల్లులు సమర్పించడం, ఈ పథకానికి సంబంధించిన భాగస్వాములందరితో సమాచారాన్ని పంచుకోవడానికి, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికా (బిఎస్ఐ) నియమించాలి. ఈ బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసా సంచాలకులు మరియు ఎన్ఐసి మధ్య సమన్వయ కర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ ని అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంటరుణాల డేటాను డిజిటల్ సంగ చేయాలి. ప్రతి బ్యాంక్ తమ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సిబిఎస్) నుండి రిఫరెన్స్ 1వ మెమో మరియు జత చేసినట్టి ప్రొఫార్మా1లో డిజిటల్ సంతకం చేసిన సంక్షిప్తిని ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు సిబిఎస్లో లేవు. కాబట్టి, పిఏసిఎస్ కు అనుబంధమైన సంబంధిత బ్యాంక్ బ్రాంచ్, రిఫరెన్స్ 2వ మెమో మరియు జత చేసినట్టి ప్రొఫార్మా2లో డేటాను డిజిటల్గా సంతకం చేసి ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రతి బ్యాంకు సిబిఎస్ నుండి సేకరించిన డేటాను యథాతథంగా ప్రభుత్వానికి సమర్పించాలి. ఈ ప్రక్రియ యొక్క ఉద్దేశ్యం తప్పుడు చేరికలు, తప్పుడు తీసివేతలను నివారించడం. అవసరమైతే వ్యవసాయశాఖ సంచాలకులు మరియు ఎన్ఐసి డేటా వాలిడేషన్ తనిఖీలను చేపట్టాలి. ఈ పథకం కింద లబ్దిదారుల మరియు రైతుకుటుంబాన్ని గుర్తించడానికి బ్యాంకులు సమర్పించిన రైతు రుణ ఖాతాలోని ఆధార్ ను పాస్ బుక్ డేటా బేస్ లో ఉన్న ఆధార్ తో మరియు పిడిఎస్ డేటాబేస్ లో ఉన్న ఆధార్ తో మ్యాప్ చేయాలి. ఈ విధంగా గుర్తించబడ్డ ఒక్కో రైతు కుటుంబానికి 09122023 నాటికి బకాయి ఉన్న సంచిత (క్యుములేటివ్) రుణమాఫీ రూ.2.00 లక్షల వరకు పరిమితి వర్తిస్తుంది. అర్హతగల రుణ మాఫీ మొత్తాన్ని డిబిటి పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల రైతు రుణఖాతాలకు జమచేయబడుతుంది. పీఏసిఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డిసిసిబి లేదా బ్యాంకు బ్రాంచికి విడుదల చేయడమవుతుంది. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పిఎసిఎస్ లో ఉన్న రైతు ఖాతాలో జమచేస్తారు. ప్రతి రైతు కుటుంబానికి 09122023 తేదీ నాటికి ఉన్న రుణమొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో రుణమాఫీ మొత్తాన్ని జమచేయాలి. ప్రతి రైతుకుటుంబానికి 09122023 నాటికి కలిగిఉన్న మొత్తం రుణం కానీ లేక రూ.2.00 లక్షల వరకు ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఆ రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది. ఏ కుటుంబానికి అయితే రూ.2.00 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ.2.00 లక్షలకు పైబడివున్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. తరు అర్హతగల రూ. 2.00 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేయనున్నారు. రూ. 2.00 లక్షల కంటే ఎక్కువ రుణం వున్న పరిస్థితులలో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతి కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేయాలి.

**మినహాయింపులు:**

1. ఈ రుణమాఫీ ఎస్ఎచ్జీలు, జెఎల్జీలు, ఆర్ఎంజిలు, ఎల్ఎసిఎస్లకు తీసుకున్న రుణాలకు వర్తించదు.
2. ఈ రుణమాఫీ పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూలు చేసిన రుణాలకు వర్తించదు.
3. కంపెనీలు, ఫర్మ్ వంటి సంస్థలకి ఇచ్చిన పంటరుణాలకు వర్తించదు. కానీ పిఎసిఎస్ ద్వారా తీసుకున్న పంటరుణాలకు వర్తిస్తుంది.
4. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పిఎంకిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద డేటా లభ్యంగా వున్నంత మేరకు మరియు ఆచరణాత్మకంగా అమలు చేయడం వీలైనంత వరకు పరిగణనలోనికి తీసుకోబడుతుంది.
5. బ్యాంకుల యొక్క బాధ్యత : ప్రతి బ్యాంకు (ప్రొఫార్మా I & II జతచేయనైనది) లో డేటాను బాధ్యతగా ప్రభుత్వానికి సమర్పించాలి. ఈ డేటాలో రైతుల అర్హత, ప్రతి రైతుకు సంబంధించిన పంట రుణఖాతా వివరాలు సమాచార వాస్తవికత, సమగ్రత ఉండేలా సరియైన విధంగా ఇవ్వాలి. పథకం కోసం నిర్వహించే ప్రతి డాక్యుమెంటుపై, రూపొందించిన ప్రతి జాబితాపై బ్యాంకు బిఎస్ఓ డిజిటల్ సంతకం చేయాలి. నిర్ణీత మార్గదర్శకాలను ఉల్లంఘించి డేటాను సమర్పించిందని భవిష్యత్తులో కనుగొన్నట్లయితే చట్టప్రకారం బ్యాంకులపై చర్యలు తీసుకోవాలి.
6. రైతుల యొక్క బాధ్యతలు : ఈ పథకం క్రింద రుణమాఫీ పొందడానికి రైతులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు గుర్తించినట్లయితే లేదా మోసపూరితంగా పంటరుణాన్ని పొందినట్లు లేదా పంట రుణమాఫీకి అర్హులుకారని కనుగొన్నట్లయితే, పొందిన రుణమాఫీ మొత్తాన్ని రైతు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని రికవరీ చేయడానికి చట్టప్రకారం వ్యవసాయశాఖ సంచాలకుల వారికి అధికారం ఉంటుంది.
7. ఆడిటు : లోన్ అకౌంట్లలో ఉన్న డేటా యధార్థతను నిర్ధారించేందుకు సహకారశాఖ సంచాలకులు మరియు సహకార సంఘాల రిజిష్ట్రార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముందస్తు శాంపిల్ ప్రిఆడిట్ ను చేపట్టి, అమలు అధికారికి (వ్యవసాయశాఖ సంచాలకులు) వారు కనుగొన్న విషయాలను సమర్పించాలి.
8. ఈ పథకం క్రింద లబ్ది పొందిన ప్రతి రైతు బ్యాంకు అకౌంట్ ను ఆర్బిఐ/నాబార్డ్ కార్యవిధానం ప్రకారం ఆడిట్ చేయించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఈ ఆ చట్టబద్ధ (స్టాట్యుటరి) ఆడిటర్లు, ప్రత్యేక ఆడిటర్ల ద్వారా చేయించవచ్చును.
9. పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం: పథకం గురించి రైతుల సందేహాలకు, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయశాఖ సంచాలకులు ఒక పరిష్కార విభాగాన్ని స్థాపించాలి. రైతులు తమ ఇబ్బందులను ఐటి పోర్టల్ ద్వారా లేదా మండల స్థాయిలో స్థాపించిన సహాయ కేంద్రాల వద్ద తెలుపవచ్చు. ప్రతి అభ్యర్ధనను సంబంధిత అధికారులు 30 రోజుల లోపు పరిష్కరించి, దరఖాస్తుదారునికి తెలపాల్సి ఉంటుంది.

# కావాలనే కాంగ్రెస్ పార్టీ విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోంది: కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్ :**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని, కావాలనే విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆక్షేపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘటనలకు సంబంధించి అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతి సందర్భంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రోటోకాల్ ఉంటుంది. కాంగ్రెస్ నాయకులు కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అవమానించేలా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు అని ,ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు అని పేర్కొన్నారు. హుజూరాబాద్, అసిఫాబాద్ ,మహేశ్వరం సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇలాగే జరుగుతోంది. శాసనసభ్యుల హక్కులు, వారికి ప్రోటోకాల్ పరిరక్షణ, గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాసనసభాపతిదే"అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.







# బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో సిల్క్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్

**విశ్వంభర, హైదరాబాద్ :** బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో సిల్క్ ఆఫ్ ఇండియా బై క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా అధికారిక పోస్టర్‌ను ఆర్గనైజర్ సోమనాథ్, అభిజిత్ మరియు మోడల్స్‌తో కలిసి ఆవిష్కరించారు. తదుపరి మోడళ్లు ఫ్యాషన్ వాక్‌తో ఆకట్టుకున్నారు. కళాకారులు, చేనేత కార్మికులు మరియు వర్ధమాన కళాకారుల నుంచి తాజా సేకరణలను ప్రదర్శించారు. ఈ ఆవిష్కరణ సిల్వాన్ డ్రైవ్ ఇన్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ హిల్స్ లో జరిగింది. ఈ ఎగ్జిబిషన్ పోస్టర్ లాంచ్‌లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అభిజిత్ అన్నారు. మన దేశానికి వస్త్ర ఉత్పత్తిలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర ఉందని, మన సాంస్కృతిక ఫాబ్రిక్‌లో చేనేత నేత ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. మన కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం మరియు అంకితభావాన్ని చెబుతుందన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనమని రత్న మెహెరా అన్నారు. ఈ ఎగ్జిబిషన్ శ్రీ సత్య నిగమాగమం, శ్రీనగర్ కాలనీలో జూలై 19 నుంచి జూలై 25 వరకు చేనేత కార్మికుల సుసంపన్నమైన వారసత్వం మరియు క్లిష్టమైన హస్తకళను తెలియజేస్తూ నిర్వహించబడుతుంది అని సోమనాథ్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి, ఆభరణాలు ప్రదర్శిస్తున్నారు.

# త్వరలోనే జాతీయ రహదారి 44 విస్తరణకు చర్యలు : మంత్రి కోమటిరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** జాతీయ రహదారి 44ను 12 లేన్లుగా విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్,బాలానగర్, నవాబ్‌పేట, మిడ్జిల్ మండలాల్లో రూ.118 కోట్ల నిధులతో చేపట్టిన డబుల్‌లేన్ బీటీ రోడ్డు పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం జడ్చర్లలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సాయంతో 44వ హైవే విస్తరకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించినట్లు వెల్లడించారు. తుక్కుగూడ నుంచి శ్రీశైలం రహదారి విస్తరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీఎం సహకారంతో ప్రత్యేక నిధులను కేటాయించి జిల్లాలో డబుల్‌లేన్ రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నల్లగొండ,మహబూబ్‌నగర్ జిల్లాల్లో డబుల్‌లేన్ రోడ్లు, బైపాస్ రోడ్ల అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. జడ్చర్ల నుంచి భూత్పూరు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు.



# రాజకీయాల్లో చెరగని ముద్ర తేళ్ల లక్ష్మీకాంతమ్మ

తేళ్ల లక్ష్మీకాంతమ్మ.. ఈ పేరు ఈ తరం తెలుగు వారికి అంతగా తెలియక పోవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆరున్నర దశాబ్దాల క్రితం లోకసభకు ఎన్నికై.. నెహ్రూ, శాస్త్రి లాంటి నాటి కాంగ్రెస్ అగ్ర నాయకుల అభిమానాన్ని చూరగొని, తర్వాత ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ప్రధాను-లకు చేరువై, మహిళా పక్షపాతిగా పేరెన్నిక గన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ డిపాజిట్ రాని, ఒకనాటి కమ్యునిస్టు కంచుకోట అయిన ఖమ్మం నుండి లోక సభకు పోటీ చేసి తొలి విజయం నమోదు చేసి, అదే ఊపులో మరో రెండు సార్లు విజయ దుందుభి మోగించి కాంగ్రెస్ జెండాను రెపరెప లాడించిన రికార్డు ఆమెదే.

## నేడు తేళ్ల లక్ష్మీకాంతమ్మ జయంతి

ఆమె రాజకీయ ఆరంగేట్రం ఎలా జరిగింది అంటే... 1957లో తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కాంగ్రెస్ పార్టీని అడిగిన సందర్భంలో ఆమె భర్త ఒక ప్రభుత్వ అధికారి అయిన కారణం తో, ఆమెకు టికెట్ నిరాకరించారు. తాను ముందుగా భారత పౌరురాలినని, తర్వాతే అధికారి భార్యనని వాదించి, లాల్ బహదూర్ శాస్త్రిని మెప్పించి ఒప్పించి ఖమ్మం లోకసభ స్థాన టికెట్ పొందారు.

అసలు కాంగ్రెస్ కు అంతకుముందు డిపాజిట్లు కూడా దక్కని సీటులో ఆమె పోటీ చేయడం, గెలవడం ఏమిటని చర్చల నేపథ్యంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి, ఔరా అనిపించి ఆ సీటులో గెలిచి చూపించారు తేళ్ల లక్ష్మీకాంతమ్మ. 1957, 1962, ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతమ్మ వరుసగా మూడుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచారు. నెహ్రూ ప్రభుత్వంలో పార్లమెంటు కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. అలాగే ఆమె తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించి, అప్పటిదాకా సివిల్స్ లో మహిళలకు ప్రవేశం లేని స్థితిలో, ఇందిరా గాంధీని ఒప్పించి సివిల్స్ లో మహిళ లకు అవకాశం లభించేలా చేశారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కోసం పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడారు. 1972లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా మహిళలు, యువకులకు ఎక్కువ టిక్కెట్లు వచ్చేలా కృషి చేశారు.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన

తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1924, జూలై 16న జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ లోని కమ్మ భూస్వాముల కుటుంబానికి చెందిన వెంకట్ రెడ్డి మంగమ్మ దంపతులకు జన్మించారు. 5వ తరగతి వరకు కర్నూలులో చదివి, గుడివాడలో ఎస్ఎస్ఎల్సీ, ఇంటర్మీడియట్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో, మచిలీ పట్నంలో బిఏ, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుండి 1971లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ పట్టా పొందారు. ఆమె 1944, నవంబరు 1న అనంతపురం జిల్లా అటవీ అధికారి టి.వి.సుబ్బారావును వివాహం చేసుకున్నారు.

లక్ష్మీకాంతమ్మ ఖమ్మం నియోజక వర్గం నుండి 1957లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, ఆ తర్వాత 1962లో, ఆ తర్వాత ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు ఎన్నికై 1977వరకు లోక్సభలో ఖమ్మంకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో పార్లమెంటు బృందంలో సభ్యురాలిగా ఆస్ట్రేలియా పర్యటించారు. 1978లో జనతా పార్టీ తరఫున హైదరాబాదు నగరంలోని హిమాయత్ నగర్ శాసనసభా నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఆమె తెలుగులో ప్రగతి పథంలో మహిళలు అనే పుస్తకాన్ని, ఆంగ్లంలో కోఆపరేషన్ టుడే అండ్ టుమారో అనే పుస్తకాన్ని ప్రచురించారు. బాద్షా ఖాన్ జీవితచరిత్రను తెలుగులోకి అనువదించారు.

తాను రాష్ట్రపతిగా ఎన్నిక కావడంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ పాత్ర కీలకమని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నారు దివంగత రాష్ట్రపతి వి.వి.గిరి. ఇందిరాగాంధీకి ఆమెతో ఉండిన సాన్నిహిత్యం దృష్ట్యా, ఎన్నిసార్లు అడిగినా కేంద్ర మంత్రి పదవి స్వీకరించ లేదని, ఒక దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా, ఆమె అంగీక రించక, మేధావి, అనుభవజ్ఞుడు అయిన పీవీ అయితేనే బాగుం టుందని చెప్పారని, పీవీ నరసింహా రావు ముఖ్యమంత్రి కావడానికి లక్ష్మీ కాంతమ్మ ఒక విధంగా కారణమని ఆ రోజుల్లో చెప్పుకునే వారు.

ఇందిరాగాంధీకి అంత సన్నిహి తురాలు అయినా, ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి, లక్ష్మీకాంతమ్మ కాంగ్రెస్ ను వీడి, జనతాపార్టీలో చేరి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. హైదరాబాద్ లో హిమా యత్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. హైదరాబాద్ లో బీహెచ్ఈఎల్, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రావడంలో ఆమెది కీలక పాత్ర అని చెబుతుంటారు. 2007 డిసెంబర్ 13న 83 ఏళ్ల వయసులో మరణించారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# భారతీయులు వీసా లేకుండా వెళ్లే టాప్-10 దేశాలు ఏవో తెలుసా?




భారతీయ పర్యాటకులకు వీసా రహిత ప్రవేశం అందించే అనేక దేశాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. ఇటీవల థాయ్‌లాండ్, శ్రీలంక భారతదేశం నుండి వచ్చే సందర్శకుల కోసం వీసా రహిత ప్రవేశ తేదీని పొడిగించాయి. ఇప్పుడు భారతీయులు 11 నవంబర్ 2024 వరకు వీసా లేకుండా వెళ్లవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 62 దేశాల్లో భారతీయ పాస్‌పోర్ట్ ఉన్నవారు వీసా లేకుండా వెళ్లవచ్చు. అంటే, మీరు సెలవుల్లో విదేశాలకు వెళ్లాలని ప్లాన్ చేస్తున్నా వీసా టెన్షన్ ఉండదు. అప్పుడు మీరు ఈ దేశాలను మీ జాబితాలో అగ్రస్థానంలో ఉంచుకోవచ్చు. విదేశాలకు వెళ్లడానికి మీకు పాస్‌పోర్ట్ మాత్రమే అవసరం. భారతీయులకు వీసా అవసరం లేని ప్రపంచంలోని టాప్10 దేశాల గురించి తెలుసుకుందాం.

**టాప్ 10 వీసా లేని దేశాల జాబితా**

భూటాన్: భూటాన్ భారతదేశం పొరుగు దేశం, భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లు వీసా లేకుండా ఇక్కడ ప్రవేశించవచ్చు. వీసా లేకుండానే భారతీయులు 14 రోజుల పాటు భూటాన్‌లో ఉండొచ్చు. హిమాలయాలతో చుట్టుముట్టబడిన ఈ దేశాన్ని ల్యాండ్ ఆఫ్ ద థండర్ డ్రాగన్ అంటారు. భూటాన్ మంచుతో కప్పబడిన పర్వతాలు, అద్భుతమైన మఠాలు, ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రసిద్ధి చెందింది.

నేపాల్: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎవరెస్ట్‌కు ప్రసిద్ధి చెందిన నేపాల్ భారతదేశానికి కూడా పొరుగు దేశం. మీరు సాహసం, ప్రకృతి ప్రేమికులు అయితే, మీరు ఇక్కడకు వెళ్ళవచ్చు. పురాతన దేవాలయాలు, విశాల దృశ్యాలను తిలకించవచ్చు. భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లు నేపాల్ వెళ్లేందుకు వీసా అవసరం లేదు.

మారిషస్: హిందూ మహాసముద్రం చుట్టూ ఉన్న మారిషస్‌లో కూడా భారతీయులకు వీసా అవసరం లేదు. ప్రకృతి ప్రేమికులు మారిషస్‌లో అద్భుతమైన బీచ్‌లు, క్రిస్టల్‌క్లియర్ వాటర్, రాళ్లతో అద్భుతమైన ప్రదేశంతో విభిన్నమైన అనుభూతిని పొందుతారు. ఈ దేశం ఒంటరిగా లేదా సమూహ ప్రయాణీకులకు గొప్ప ఎంపిక. భారతీయ పౌరులు 90 రోజుల పాటు వీసా లేకుండా మారిషస్‌లో ఉండవచ్చు.

కెన్యా: దేశంలో పర్యాటకాన్ని పెంచే లక్ష్యంతో కెన్యా జనవరి 1, 2024 నుండి భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు వీసా రహిత ప్రయాణాన్ని ప్రకటించింది. కెన్యా, శక్తివంతమైన వన్యప్రాణులు, సముద్ర నిల్వలకు ప్రసిద్ధి చెందింది. 50 కంటే ఎక్కువ జాతీయ ఉద్యానవనాలు ఉన్నాయి. భారతీయులకు 90 రోజుల పాటు వీసా రహిత ప్రయాణాన్ని అందిస్తోంది.

మలేషియా: మలేషియా రాజధాని కౌలాలంపూర్ అత్యంత అభివృద్ధి చెందిన నగరాల్లో ఒకటి. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన భవనాలలో ఒకటైన పెట్రోనాస్ ట్విన్ టవర్స్ ఇక్కడే ఉన్నాయి. ఈ దేశం దాని గొప్ప ఆహారం, చారిత్రక వైబ్, అందమైన బీచ్‌లు, వన్యప్రాణుల జాతీయ ఉద్యానవనాలకు ప్రసిద్ధి చెందింది. భారతీయులు 31 డిసెంబర్ 2024 వరకు మలేషియాకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. వీసా లేకుండా 30 రోజుల పాటు ఈ దేశంలో ఉండవచ్చు.

థాయ్‌లాండ్: అత్యంత అందమైన దక్షిణాసియా దేశాలలో ఒకటైన థాయిలాండ్, అందమైన బీచ్‌లు, రుచికరమైన వంటకాలు, సజీవ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. బ్యాంకాక్ వీధుల నుండి చియాంగ్ మాయి దేవాలయాలు, ఫుకెట్ బీచ్‌ల వరకు, థాయిలాండ్ పరిపూర్ణ పర్యాటక ప్రదేశం.

తాజా అప్‌డేట్ ప్రకారం, భారతీయులకు 11 నవంబర్ 2024 వరకు థాయ్‌లాండ్‌లో వీసా రహిత ప్రవేశం ఉంది.

డొమినికా: భారతీయులు ఈ కరేబియన్ దేశంలో వీసా లేకుండా 6 నెలల పాటు ఉండగలరు. పర్వతాలతో చుట్టు ఉన్న కరేబియన్ ద్వీపాన్ని ప్రకృతి ద్వీపం అని కూడా పిలుస్తారు. మోర్నే ట్రోయిస్ పిటన్స్ నేషనల్ పార్క్ ఇక్కడ అతిపెద్ద పర్యాటక ప్రదేశం, ఇక్కడ మీరు 1,342 మీటర్ల ఎత్తైన అగ్నిపర్వతాన్ని చూడవచ్చు. భారతీయులు డొమినికాకు విమానాన్ని సులభంగా బుక్ చేసుకోవచ్చు. ఈ అందమైన దేశాన్ని సందర్శించవచ్చు.

ఖతార్: ఖతార్ ఒక మధ్యప్రాచ్య దేశం. ఇది బలమైన మౌలిక సదుపాయాలు, రాజధాని దోహాకు ప్రసిద్ధి చెందింది. దోహాలోని ఆకాశహర్మ్యాలు నగరాన్ని అత్యంత ప్రత్యేకమైనవిగా చేస్తాయి. ఈ దేశం ప్రపంచంలోని అత్యంత ధనిక దేశాలలో ఒకటిగా పరిగణిస్తారు. ఇటీవల FIFA ప్రపంచ కప్ 2022 కూడా ఇక్కడ నిర్వహించబడింది. వీసా లేకుండా భారతీయులు ఖతార్‌కు 30 రోజుల పాటు ప్రయాణించవచ్చు. శ్రీలంక: శ్రీలంక కూడా ఇప్పుడు భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని అందిస్తుంది. ఈ దక్షిణాసియా దేశంతో భారతీయులకు కూడా చారిత్రక సంబంధం ఉంది. భారతీయ పాస్‌పోర్ట్ ఉన్నవారు వీసా లేకుండా శ్రీలంకకు వెళ్లవచ్చు

సీషెల్స్: సీషెల్స్ అందమైన బీచ్‌లు, నీటి అడుగున క్రీడలు, అందమైన చేపలు, వేల్ షార్క్‌లు, స్వచ్ఛమైన నీటికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ప్రశాంత వాతావరణంలో మీరు భిన్నమైన శాంతిని అనుభవిస్తారు. భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లు 30 రోజుల పాటు వీసా లేకుండా ఈ దేశాన్ని సందర్శించవచ్చు.

# కోటీశ్వరులు కావాలనే కల సాకారం చేసే మార్గాలివే..

జీవితంలో విజయం సాధించాలంటే పటిష్టమైన ఆర్థిక ప్రణాళిక చాలా అవసరం. సంపాదించే ఆదాయంలో కొంత పొదుపు చేయడం, దాన్ని పెట్టుబడిగా పెట్టడం వల్ల భవిష్యత్తులో పెద్ద మొత్తంలో ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. దీని కోసం ముందుగా పొదుపును అలవాటు చేసుకోవాలి. చిన్న వయసు నుంచే పెట్టుబడులు పెట్టుబడి వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయి.

**పొదుపుతో రాబడి..**

ఆధునిక కాలంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. చాలామంది చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. అలాగే వ్యాపారంలో కూడా రాణిస్తున్నారు. చిన్న వయసు నుంచే ఆదాయం కూడా సంపాదిస్తున్నారు. ఆ ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసి వివిధ మార్గాలలో పెట్టుబడి పెట్టడం వల్ల దీర్ఘ కాలంలో అనేక లాభాలు కలుగుతాయి. అలాగే క్రమశిక్షణ కలిగిన జీవన విధానం అలవాటు అవుతుంది.

**పెట్టుబడి మార్గాలు..**

యువత పెట్టుబడులు పెట్టడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. వాటిలో అత్యున్నతమైన ఐదు రకాల అవకాశాల గురించి తెలుసుకుందాం. వీటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.

**మ్యూచువల్ ఫండ్స్..**

మ్యూచువల్ ఫండ్స్ ను అనుభవం కలిగిన మేనేజర్లు నిర్వహిస్తారు. వీటిలో పెట్టుబడి పెట్టడం యువతకు చాలా ఉపయోగం ఉంటుంది. యువ పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక రాబడిని అందించడానికి ఈక్విటీ ఫండ్‌లు ఉపయోగంగా ఉంటాయి. హైబ్రిడ్, డెట్ ఫండ్స్ కూడా అనుకూలంగా ఉన్నప్పటికీ తక్కువ రాబడిని అందిస్తాయి.



**ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్..**

పన్ను ఆదా ప్రయోజనాల కోసం ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) మంచి ఎంపిక. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 80సీ కింద మినహాయింపు లభిస్తుంది. ఈఎల్ఎస్ఎస్ లో సంపదపై ఏడాదికి రూ.46,800 వరకూ పన్ను ఆదా చేయడం సాధ్యమవుతుంది.

**స్టాక్ మార్కెట్లు..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు కూడా యువతకు ఉపయోగంగా ఉంటాయి. దీర్ఘకాలిక పెట్టుబడులతో గణనీయమైన లాభాలు పొందవచ్చు. అయితే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టాలంటే మార్కెట్ పరిజ్ఞానం అవసరం. ఉదాహరణకు 2001లో ఐషర్ మోటార్స్ షేర్లలో రూ. 55,000 పెట్టుబడి పెడితే.. ఇప్పుడు రూ. 4.75 కోట్లుగా అయ్యింది.

**బ్యాంక్ డిపాజిట్లు..**

మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్ లో రిస్క్ లను ఇష్టపడని వారికి బ్యాంకులలో డిపాజిట్ పథకాలు ఉన్నాయి. రాబడి తక్కువ ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తాయి. ముఖ్యంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు అనుకూలంగా ఉంటాయి.

**ప్రభుత్వ పథకాలు..**

సురక్షితమైన పెట్టుబడి మార్గాలలో ప్రభుత్వ పథకాలు ఒకటి. వీటిలో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఒకటి. 15 ఏళ్ల లాక్ ఇన్ పీరియడ్‌తో ఏటా 7 నుంచి 9 శాతం రాబడిని అందిస్తుంది. అలాగే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ), వలంటరీ ప్రావిడెంట్ ఫండ్ (వీపీఎఫ్) కూడా అనుకూలంగా ఉంటాయి.

**యులిప్‌లు..**

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు(యూఎల్ఐపీలు)(యులిప్‌లు) బీమా కవరేజీతో పాటు దీర్ఘకాల సంపదను అందిస్తాయి.

# ఆగస్టు 15 నాటికి పంట రుణాలను మాఫీ చేస్తాం

## రైతులకు సాగుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : ఉత్తమ్ కుమార్ రెడ్డి

**విశ్వంభరా హైదరాబాద్ :** తెలంగాణలో ప్రభుత్వం ఆగస్టు 15 లోగా రైతులకు రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తుందని పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా టీపీసీసీ కిషన్ సెల్ ప్రెసిడెంట్ ఎస్ అన్వేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైతులను అప్పుల బాధ నుంచి విముక్తం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే దఫాలో పంట రుణాలను మాఫీ చేసేందుకు కట్టుబడి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దీని వల్ల లక్షలాది మంది రైతులు తమ ఆదాయాన్ని ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు.

పంట రుణాల మాఫీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15 లోగా పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. రైతుల ఆర్థిక సాధికారత లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని నీటి పారుదల శాఖ మంత్రి హైలైట్ చేశారు. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన వెంటనే రైతు భరోసా పథకాన్ని ప్రారంభించామని, ఇది రైతులందరికీ ఏడాదికి ఎకరాకు రూ.15,000 పెట్టుబడి మద్దతునిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయకట్టును పెంచేందుకు కనీస పెట్టుబడితో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

గత బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, పేరుమార్చి ప్రజాధనాన్ని వృథా చేశారని, వాటి వల్ల రైతులకు ఎలాంటి మేలు జరగలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి లక్ష ఎకరాలకు కూడా నీరందించలేకపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాన్ని సృష్టించే బదులు ఆచరణాత్మక పరిష్కారాలు మరియు స్పష్టమైన ఫలితాలపై దృష్టి సారిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. అన్వేష్‌రెడ్డి నియామకంపై అభినందనలు తెలిపిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పటిష్టమైన సంస్థగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో నకిలీ విత్తనాల వ్యాప్తిని నియంత్రించలేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు.



రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించడంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుండా, రైతుల నుండి అన్ని ఉత్పత్తులను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఎంఎస్‌పి కంటే తక్కువ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా మధ్యవర్తులు మరియు వ్యాపారులను హెచ్చరిస్తున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ జనాభాలో దాదాపు 70% మంది వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నారని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందని, వ్యవసాయ కార్యకలాపాలను యాంత్రీకరించడంతో పాటు, వ్యవసాయ దిగుబడిని మెరుగుపరచడానికి మరియు పెంచడానికి సాంకేతికత మరియు కృత్రిమ మేధస్సును ఉపయోగించాలని మంత్రి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పంట రుణాల మాఫీ సహా పలు కీలక అంశాలపై రానున్న అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# రాజ్యసభలో ఎన్‌డీఏకి వైసీపీ సాయం కావాల్సిందే..?

**విశ్వంభర, న్యూ ఢిల్లీ :** రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యాబలం 101కి పడిపోయింది. అలానే మరోవైపు సొంతంగా బీజేపీ సంఖ్యా బలం 86కి తగ్గింది. ఇప్పుడు ఇండియా కూటమి బలం 87కి చేరింది. రాజ్యసభలో మొత్తం 225 సీట్లు ఉండగా ఈ క్రమంలో రాజ్యసభలో ఏదైనా బిల్లు ఆమోదం పొందాలంటే 113 సంఖ్యా బలం ఉండాలి. దీంతో రాజ్యసభ మెజారిటీ మార్క్ 113 కంటే ఎన్డీయే ఎంపీల సంఖ్య తక్కువగానే ఉంది. ఈ క్రమంలో అధికార ఎన్డీయే కూటమి రాజ్యసభలో బిల్లులను ఆమోదం కోసం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది. రాజ్యసభలో 11 మంది ఎంపీలు ఉన్న వైసీపీ సహాయం, 4 స్థానాలు అన్నాడీఎంకే పార్టీ సహాయం ఎన్టీఏ కూటమి సర్కార్‌కు అవసరం అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.





## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌడ సోదరుల కోసం ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కవచాన్ని అబ్దుల్లాపూర్మెట్ గ్రామంలో ఆవిష్కరించిన సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా గౌడ సోదరులందరూ.. ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటూ సోమవారం కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో గాంధీభవన్లో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌడ జాతి అభ్యున్నతికి కృషి చేస్తున్న బీసీ సంక్షేమ శాఖ మాత్యులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ తో పాటు కల్లుగీత కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముద్దగౌని భాస్కర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పల్లె ప్రదీప్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముద్దగౌని రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్



**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సత్కరించి మత్స్యకార చేపను గుర్తుగా అందించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో తనను రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి 'బలహీన వర్గాలు, మత్స్యకార పక్షపాతిగా చరిత్రలో మిగిలి పోతారని కొనియాడారు. క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్తలను సీఎం రేవంత్ రెడ్డి నాయకులుగా చేశారని చెప్పారు.

## కొత్తూరు ఎస్సైగా బలరాం నాయక్



**విశ్వంభర, కొత్తూరు** : కొత్తూరు పీఎస్‌లో విధులు నిర్వహించిన ఎస్సై కే శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. కే శ్రీనివాస్ స్థానంలో నూతన ఎస్సైగా బలరాం నాయక్ నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం బలరాం నాయక్ బాధ్యతలు చేపట్టారు.

**ఎస్సైకి సన్మానం**

నూతన ఎస్సై బలరాం నాయక్‌ను మాజీ ఉపసర్పంచ్ పాముల రమేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు ఎర్రోళ్ల జగన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖకు ఎల్లప్పుడు సహకరిస్తామని ఎస్సైకి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. చట్టాల పరిరక్షణకు మీ అందరి సహకారం అందించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**విశ్వంభర, కూకట్ పల్లి** : అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ శేర్లింగంపల్లి యూనియన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జి.ఓ నెం.10ని వెంటనే రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జి.ఓ ఇవ్వాలని, గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మెలో ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, జిల్లా గణేష్, కంది జ్ఞానేశ్వర్, రఘునాథ్, శోభన్, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**విశ్వంభర, ఆత్మకూరు (ఎం)** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు పాఠశాల తరపున శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల దామోదర్, మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య, మాజీ వైస్ ఎంపీపీ పద్మ పాపయ్య, కందుల సంతోష్, ఏఏ పిసి చైర్ పర్సన్ భాష బోయిన భారతమ్మ, మాజీ చైర్మన్ అశోక్, గ్రామ ప్రముఖులు పాల్గొని ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు కడారి సతీష్, నాతి మల్లేష్, షారాజి బాబు, ఆవుల వెంకటేశ్వర్లు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనిత, సునీత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కట్ట మైసమ్మ గుడిలో కన్నుల పండుగగా అశాడ బోనాల జాతర



విశ్వంభర, ముషీరాబాద్ : ట్యాంక్ బండ్‌పై వెలిసిన కనకాల కట్ట మైసమ్మకు ఆషాడం బోనాలను అత్యంత వైభవంగా సమర్పిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆషాడ మాసం బోనాలు సందర్భంగా కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ట్యాంక్ బండ్ పై వెలసిన కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అత్యంత ప్రాచీనమైందన్నారు. ఈ దేవాలయానికి దూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలతో వేలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారని తెలిపారు. ఆషాడమాసం బోనాల జాతర ప్రతి ఏడు అత్యంత వైభవంగా జరుగుతుందని ఎప్పటి లాగానే ఈ సంవత్సరం ఆషాడ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. అందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూ లైన్లు మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి ఆషాడ బోనాల మహోత్సవానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, ఆలయ చైర్మన్ గౌతమ్ రాజు, దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి సాంబశివరావు, యువ నాయకులు ముఠా జై సింహా, ముషీరాబాద్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్, హిమైత్ నగర్ ఎమ్మార్వో సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ మైత్రి, స్ట్రీట్ లైట్ ఏఈ జ్యోతిర్మయి, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వీరేశం, స్ట్రీట్ లైట్స్ డీఈ శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆన్ లైన్‌లో ప్రారంభమైన సీఎం సహాయనిధి దరఖాస్తులు




**విశ్వంభర, హైదరాబాద్** : రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిధులు దుర్వినియోగం కాకుండా అర్హులకు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను ఆన్లైన్లో స్వీకరణకు శ్రీకారం చుట్టారు. అల్ లైన్ లింక్ ను కూడా ఏర్పాటు చేశారు. ఇందుకోసం స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు లాగిన్ ఐడీ కేటాయించారు. వారి వద్దకు వెళితే సీఎంఆర్ఎఫ్ ఆన్లైన్ పోర్టల్లో పేషెంట్ల వివరాలు నమోదు చేయనున్నారు. బాధితులు సమర్పించిన సర్టిఫికెట్లు సరైనవేనా? కాదా అనే వివరాలను తెలుసుకోవడానికి పోర్టల్లో ప్రత్యేక విధానాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా సీఎంఆర్ఎఫ్ను పారదర్శకంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్సైట్ను రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధుల మళ్లింపు నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక నుంచి ముఖ్యమంత్రి ప్రావిడెంట్ ఫండ్ దరఖాస్తులను ఈ వెబ్సైట్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. స్థానిక మంత్రి. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలను తీసుకుని వారి సిఫార్సు లేఖను అప్లోడ్ చేస్తారు. దరఖాస్తులో సంబంధిత దరఖాస్తుదారు బ్యాంకు ఖాతా నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. అప్లికేషన్ ను అప్లోడ్ చేసిన తర్వాత CMRFకి సంబంధించిన కోడ్ ఇవ్వబడుతుంది. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సెక్రటేరియటు సమర్పించాలి. నిర్ధారణ కోసం ఆన్లైన్ దరఖాస్తు సంబంధిత ఆసుపత్రులకు పంపబడుతుంది. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే, CMRF దరఖాస్తు ఆమోదించబడుతుంది మరియు లబ్ధిదారునికి చెక్కు తయారు చేయబడుతుంది. దరఖాస్తుదారు ఖాతా నంబర్ చెక్కుపై ముద్రించబడుతుంది. దీంతో చెక్ పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు స్వయంగా దరఖాస్తుదారులకు చెక్కులను అందజేస్తారు.

## రేవంత్ రెడ్డిని సీఎంగా కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు



**విశ్వంభర, హైదరాబాద్** : బీజేపీ, బీఆర్ఎస్ విలీనంపై మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని చెప్పారు.బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేస్తామని ఇటీవల ఆ పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్లి చర్చలు జరిపారని.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనాన్ని కిషన్ రెడ్డి వ్యతిరేకిస్తే బండి సంజయ్ మద్దతు పలికారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే బండి సంజయ్ ఆదివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ హరీష్‌రావు మంచి లీడర్ అని పొగిడారని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను బీజేపీ కూలుస్తుంటే కేసీఆర్ మద్దతు పలికారని విమర్శించారు. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరే ఎమ్మెల్యేలకు ఎలాంటి హామీలు ఇవ్వడం లేదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజా పాలనను చూసే ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని తెలంగాణ సీఎంగా కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.

## ఇకపై కాజీపేట మీదుగా సికింద్రాబాద్ కు ప్రత్యేక రైలు

**విశ్వంభర, సికింద్రాబాద్** : ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 26 వరకు ముజఫర్‌పూర్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - ముజఫర్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ముజఫర్‌పూర్ - సికింద్రాబాద్ (05293) రైలు ఈ నెల 16 నుంచి ప్రతి మంగళవారం ఉదయం 10.45 గంటలకు రైల్వేస్టేషన్ నుంచి చేరుకొని మరుసటిరోజు రాత్రి 23.50 గంటలకు గమ్యస్థానం చేరుతుందని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. సికింద్రాబాద్ - ముజఫర్‌పూర్ (05294) రైలు ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 26 వరకు ప్రతి గురువారం ఉదయం 3.55 బయలుదేరి.. శుక్రవారం మధ్యాహ్నం 4.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ రైలు ఇరుమార్గాల్లో హాజీపూర్, పాటలిపుత్ర, దానాపూర్, ఆరా జంక్షన్, బక్సర్, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, ప్రయాగ్‌రాజ్, సాత్న, కట్ని, జబల్‌పూర్, ఇటార్సీ, నాగ్‌పూర్, బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట స్టేషన్లలో ప్రత్యేక రైలు ఆగుతుందని సౌత్ సెంట్రల్ రైల్వే పీఆర్వో శ్రీధర్ తెలిపారు. రైలులో ఫస్ట్ ఏసీ, ఏసీ 2 టైర్, ఏసీ 3 టైర్, ఎకానమీ క్లాస్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



## విద్యార్థులకు ఉచితంగా బట్టల పంపిణీ



**విశ్వంభర, నందిగామ** : మండల పరిధిలోని చేగూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేగూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బంటారం మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బట్టలు, ఐడెంటి కార్డులు, బెల్ట్ టైలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ హాజరై బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషదాయకమని, అలాగే ఇలాంటి కార్యక్రమాల కోసం అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేగూర్ గ్రామ తాజా మాజీ వార్డు సభ్యులు పబ్బే రవితేజ, కావాలి మదు యాదవ్, మాజీ వార్డు యాదగిరి గౌడ్, ఎంపీ శ్రీనివాస్ గౌడ్, పబ్బే నరేందర్, అన్నారం నరసింహ, ఎల్లికట్టే రాజు, మంగలి శ్రీనివాస్, లెంకపోతుల నరసింహ, ఎంపీ కుమార్ గౌడ్, బాలరాజు గౌడ్, మంగలి గిరి, రఘుగౌడ్, కొత్తూరు రాజు, దొర కృష్ణ, నర్సింగ్ రావు, లాటు, పబ్బే చంటి, పబ్బే నరేందర్, మంగలి నరేష్, ప్రశాంత్ గౌడ్, వెంకట్ చారి, నరేష్‌దల్లి, కిరణ్ గౌడ్, మహేష్‌గౌడ్, శివ గౌడ్, కందడ కుమార్, శివ, వెంకట్ స్వామి, ప్రణవ్, ఖరీం తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ దాతృత్వం

**విశ్వంభర, కరీంనగర్** : కరీంనగర్ నగర పాలక సంస్థ ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ నేపాల్‌కు చెందిన నిరుపేద విద్యార్థుల చదువుల కోసం చేయూతనందించారు. నేపాల్‌కు చెందిన సంతోష్, కళావతి అనే దంపతులు బతుకు తెరువు కోసం కరీంనగర్‌కు వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో పనిచేస్తూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఆసీస్ (10), కార్తీక్ (8), ఒక కుమార్తె సాన్విక (6) ఉన్నారు. పిల్లలను చదివించలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తీగలగుట్టపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు అవసరమైన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ ఇతర సామాగ్రిని అందించారు. పిల్లల



తల్లిదండ్రులు ఈ సందర్భంగా కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



## వీర జవాన్లకు నివాళులు

**విశ్వంభర, పరిగి** : జమ్మూ కాశ్మీర్ గుల్గమ్ జిల్లా భారత్ పాకిస్తాన్ సరిహద్దుల్లో, జమ్మూ కాశ్మీర్ గుల్గమ్ జిల్లా భారత్ పాకిస్తాన్ సరిహద్దుల్లో డ్యూటీ నిర్వహిస్తున్న భారత్ ఆర్మీ పైన పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన ఐదుగురు భారత వీర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం పరిగి పట్టణంలో న్యూ బ్రిలియంట్ పాఠశాలలో ఎక్స్ ఆర్మీ అసోసియేషన్, పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలవేసిన నివాళులు అర్పించారు. డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ.. కర్తవ్య దీక్షతో దేశాన్ని ఆర్మీ జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చలి ఎండ వర్షం అనే తేడా లేకుండా దేశాన్ని రక్షిస్తారని, అలా ఎంతోమంది సైనికులు భారతదేశం కోసం తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు. ప్రజల్లో దేశభక్తి జాతీయతాభవం పెంపొందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు గుర్నాథరెడ్డి, లింగం పోచయ్య, రాజకుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, కౌన్సిలర్ రియాజ్, మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్వాడికి పంపండి

**- అంగన్వాడీ సూపర్వైజర్ కే శ్రీదేవి**



**విశ్వంభర, నారాయణపూర్** : అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ కే శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రజలకు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో నర్సరీ తరగతులు నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. దీనికి ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతి కార్యదర్శి నరేష్, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, ఏఎన్ఎం మేరీ,కవిత, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు, పిల్లల తల్లులు,పిల్లలు గ్రామపంచాయతి కారోబార్ ముత్యాల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల పర్యటన సందర్భంగా పనుల పరిశీలన



**విశ్వంభర, ఆమనగల్లు** : కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ప్రారంభానికి ఈ నెల 17వ తారీఖున ఉదయం 10:00 గంటలకు మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు ముఖ్య అతిథులుగా వస్తున్నారని వారు పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసే స్థలాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు కూడా హాజరవుతున్నందున కల్వకుర్తి నియోజకవర్గం అన్ని మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అంగన్ వాడీల సమస్యల పరిష్కరించాలి



**విశ్వంభర, షాద్‌నగర్** : గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు మరియు హెల్పర్ కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్ రాజు అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా పైగా వ్యతిరేక విధానాలు వేగవంతంగా అమలు చేయడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ తీవ్రమైన ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు. అంగన్వాడీలను ఉద్దేశించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. అంగన్వాడీల సమస్యలపై మా ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీను నాయక్, సిఐటియు కేశంపేట మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్, అంగన్వాడి టీచర్స్ హెల్పర్ ప్రాజెక్టు నాయకులు కే జయమ్మ, ఊర్మిళ, సంగీత, సుజాత, మమత, హేమలత, వీణ, అనసూయ, శోభారాణి, జ్యోతి, నర్సమ్మ, జయమ్మ, శ్రీదేవి, ఇందిర, ఉమా, రాజ్యలక్ష్మి, తులసి, వినోద, సంతోష, భాగ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండలో ఫిలిం సిటీ ఏర్పాటు పై
# హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

విశ్వంభర, నారాయణపూర్ : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాజు ఏలిన కొండ రాచకొండ కొండను రాష్ట్ర ప్రభుత్వం ఫిలిం సిటీగా చేయటం గొప్ప పరిణామని, ఒకప్పుడు రాచరిక పాలనకు కేంద్ర బిందువైన కొండలు రాచకొండలు ఈ గుట్టలు నల్లగొండ రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతాలలో వేలాది ఎకరాలలో విస్తరించి ఉన్నాయని అన్నారు. రేచర్ల పద్మనాయకులు 1361లో రాచకొండను రాజధానిగా చేసుకుని పరిపాలన చేశారు. తెలంగాణలో కాకతీయ రాజుల తర్వాత చెప్పుకోదగిన రాజులు రాచకొండ వెలమ రాజులు. రాచకొండలో పచ్చగా కనిపించే గుట్టలు అరకులోయను మించిన అందాలు కలిగి ఉన్నాయి. ఎత్తైన కొండలు గుట్టలు ప్రాచీన దేవాలయాలు అద్భుతమైన శిలా కళా సంపద కనులకు కనువిందు చేసే విధముగా అబ్బుర పరిచే విధంగా కన్నులకు కనిపించే అందాలను తెలంగాణ సమాజానికి అందించుటకు కృషి చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాచకొండను ఫిలిం సిటీ గా చేయుటకు నిర్ణయించటం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు.

ఈ సందర్భంగా నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన హర్షం ప్రకటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏపూరి సతీష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కరంటొౌతు శ్రీనివాస్ నాయక్, ఎండీ నయీం షరీఫ్, సీనియర్ నాయకులు జక్కిడి బాల్ రెడ్డి, రాచకొండ రమేష్, ఉప్పల కృష్ణ, ఉప్పల నాగరాజు, జక్కల యాదయ్య, కురుమేద్ద గోపాల్, కొర్ర తండా మాజీ



సర్పంచ్ కొర్ర లచ్చిరాం నాయక్, కొర్ర నానునాయక్, కొర్ర శంకర్ నాయక్, కొర్ర మోహన్ నాయక్, రాచకొండ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాట్రోత్ సేవా నాయక్, కట్రోత్తు రవీందర్, బానోతు లాలు నాయక్, ఏపూరి శివయ్య, ఉప్పరగొని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**విశ్వంభర, షాద్‌నగర్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజక వర్గంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం వెళ్లతున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు జూపల్లి కృష్ణారావు వస్తున్న సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి పట్టణంలోని బైపాస్ రోడ్డులో స్వాగతం పలికారు. సోమవారం ఉదయం పారడైజ్ హోటల్ వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్ వారిని కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు



**విశ్వంభర, అమ్మనబోలు :** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, మమ్మల్ని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్లో నిర్బంధించడం దారుణమని అమ్మనబోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి బొడిగె భరత్ గౌడ్, ఎంజీ యూనివర్సిటీ నాయకులు అన్నారు. గత కొన్ని రోజులుగా నిరుద్యోగులంతా రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేస్తుంటే సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులు చేసి, ఉద్యమాన్ని ఆపాలని చూస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

## మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలి

- ఎంపీడీవో రామకృష్ణ



**విశ్వాంభర, కుల్కచర్ల :** మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో రామకృష్ణ మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటి రక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, మొక్కల పెంపకంతో మానవమనుగడ సాగుతుందన్నారు. భవిష్యత్ తరాలకు చక్కటి అహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు విరివిగా కురుస్తాయని చెరువులు కుంటలు నిండి భూగర్భ జలాలు పెరగడంతో రైతులు పంటలు పండించుకోవచ్చని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కరీం, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ కుమార్, టీఏ నరేష్, ఎఫ్ఏ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజల సమస్యల పరిష్కారం



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో సుజాత దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం 33 ఫిర్యాదులు వచ్చాయని ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ హర్షద్, ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిని శ్రీదేవి, ఎంపీఓ, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ సునీల్ రావు రాజకీయ వ్యభిచారి
## పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్

**విశ్వంభర, కరీంనగర్ :** పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ.. కరీంనగర్ నగర మేయర్ సునీల్ రావు రాజకీయ వ్యభిచారి, 25 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న సునీల్ రావు ప్రోటోకాల్ ప్రకారం జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ని పాలకవర్గంతో కలిసి కలవకపోవడం శోచనీయమని అన్నారు. అవినీతిపరుడైన మేయర్ వారిని సమర్థించే బండి సంజయ్ ఇద్దరిదీ అక్రమ కలయిక అని పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఎద్దేవా చేశారు.







## కీచక టీచర్‌కు తల్లిదండ్రులు దేహశుద్ధి

**విశ్వంభర, మేడిపల్లి :** అమ్మాయిలు, చిన్నారులపై వరుస లైంగిక దాడులు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. కన్న కూతురిపై తండ్రి అఘాయిత్యం, సొంత చెల్లినే గర్భవతిని చేసిన సోదరుడు లాంటి ఘటనలు వెలుగులోకి వచ్చి అమ్మాయిల భద్రతను నిలదీస్తున్న క్రమంలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషల్ స్కూల్లో ఒకటో తరగతి విద్యార్థిని పట్ల డ్యాన్స్ మాస్టర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. డ్యాన్స్ మాస్టర్ చేష్టలను ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు తెలపటంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆ చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు స్కూల్‌కు చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు డ్యాన్స్ మాస్టర్‌ను, పాఠశాల ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## విధి నిర్వహణలో బదిలీ సహజం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు రఘు, కడ్తాల్ పోలీస్ స్టేషన్‌కు శ్రీశైలం కేశంపేట పోలీస్ స్టేషన్‌కు బదిలిపై వెళుతున్న సందర్భంగా ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ మరియు సిబ్బంది పూలమాలతో సత్కరించి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బదిలీలు సహజమని శాంతి భద్రత విషయంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాల్ రెడ్డి, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేవైఎం, ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, భూపాలపల్లి :** డీఎస్సీ వాయిదా వేయాలని గ్రూప్ 1, 2 పోస్ట్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా భూపాలపల్లి జిల్లాలో మహాదేవపూర్ మండలంలోని బీజేవైఎం, ఏబీవీపీ నాయకులను అర్ధరాత్రి 11 గంటల సమయంలో భారీ వర్షంలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అరెస్ట్ అయినా వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి జోగేశ్వర్ రావు, కార్యదర్శి బల్ల సంపత్, ఏబీవీపీ నగర కార్యదర్శి పేట సాయి, నాయకులు గోగుల కృష్ణ, రవితేజ, సుశాంత్, వెంకటేష్, సంజయ్‌లు ఉన్నారు.



షాద్‌నగర్ పట్టణ సీఐగా బాధ్యతలు తీసుకున్న విజయ్ కుమార్ సోమవారం స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణ సీఐ విజయ కుమార్‌కు సూచించారు.

- విశ్వంభర, షాద్‌నగర్

## ఆరోగ్యశాఖ సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశం



**విశ్వంభర, షాద్ నగర్:** వర్షాకాలంలో వచ్చె సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏమైనా ఎమర్జెన్సీ మందులు అందుబాటులో లేనట్లయితే తెలపాలని, అందుబాటులో ఉన్న ఫార్మా కంపెనీల నుండి ఇప్పించే ప్రయత్నం చేస్తామని వైద్యాధికారులకు తెలియజేశారు. కానీ వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పేదవారికి తగిన సహాయం చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లతో ఆప్యాయత అనురాగంతో మాట్లాడి వారికి కావలసిన చికిత్స చేయాలన్నారు. ఆస్పత్రుల మీద ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. 102, 108 వాహనాలు సరిగా పనిచేసేటట్లు అందులో పని చేసే సిబ్బందికి డ్రైవర్లకు సరైన సూచనలు ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో కార్యదర్శులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి షాద్ నగర్ డివిజన్ డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేశంపేట, బూర్గుల వైద్యాధికారులు డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ నికిత, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శీనీవాసులు, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఎన్పీఆర్డీ నూతన కమిటీ ఎన్నిక




**విశ్వంభర, షాద్‌నగర్ :** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (NPRD) రంగారెడ్డి జిల్లా మూడవ మహసభలు షాద్‌నగర్‌లో 14, 15 తేదీల్లో అట్టహాసంగా జరిగాయి. మొదట రోజు బహిరంగ సభ, వికలాంగుల హక్కులు మరియు డిమాండ్స్ గురించి చర్చించారు. రెండవ రోజు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌ.శ్రీ కురువునేల్లి వేంకట్ అధ్యక్షుతనతో రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా అశాన్నగారి భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జేర్కోని రాజు, ఉపాధ్యక్షులుగా చేగురి శేఖర్ గౌడ్, కోశాదికారిగా నాగార్జున శ్రీనివాస్ చారి, సహయ్య కార్యదర్శిగా అబ్బే సంతోషను ఏకగ్రీవంగా నియమించి నియమాక పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులుగా కాకి నర్సింహ్మ, దంతుక రాములు, సిలివేరు బాలమణి, అశవ్వల బాల్‌రాజ్, గుడూరి శ్రీనివాస్, అరేంపుల జానయ్య, డప్పు రాజు, బోడ శ్రీనివాస్, కాసాల యదయ్య, మంగల్లి మల్లేష్, రాజ్ కుమార్, సురేష్, నాగరాజు, పబ్బు సుధాకర్, గండ్రాతి సాయి, ఈదులపల్లి నర్సింహ్మ గౌడ్, ఎనిమిది మందిని కోఆప్షన్ సృభులుగా నియమించారు. జిల్లా ఆఫీస్ బేరర్స్ గా 10 మందిని ఎన్నుకున్నారు. వికలాంగుల అభ్యున్నతికి భవిష్యత్తులో నిరంతర ఉద్యమాలకు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తమపై విశ్వాసం ఉంచి పదవులను నియమించిన సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఎన్పీఆర్డీ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రియల్ ఎస్టేట్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి



**విశ్వంభర, కొత్తూరు :** రియల్ ఎస్టేట్ రంగంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీలోని పెద్దమ్మ తండా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ ఆఫీస్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం రియల్ ఎస్టేట్ యజమాన్యం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్‌ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుకొని నిరుద్యోగులుగా ఉండకుండా స్వయంకృషితో పని చేసుకోవాలని, అప్పుడే తమ తల్లిదండ్రుల మీద ఎలాంటి భారం పడకుండా ఉంటుందన్నారు. నిరుద్యోగ వ్యవస్థను కూడా రూపుమాపొచ్చన్నారు. యువత ఖాళీగా ఉండకుండా వారి నైపుణ్యంతో ఏదో ఒక పని చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాదారం కృష్ణ గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు వీరమోని వెంకటేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మొర్ర జనార్ధన్ రెడ్డి, ఎరుకలి విష్ణుమూర్తి, యువ నాయకుడు శివ చారి, సాగర్, అనిల్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు బండి రమేష్, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో యువతీ యువకులకు

# స్వయం ఉపాధి అవకాశాలకు కృషి

○ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. సోమవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ వేడుకలు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారాభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహ్మద్ అలీ షబ్బీర్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెట్విన్ ఎండీ కే వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెట్విన్, పర్యావరణ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అతిథులు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెట్విన్ సంస్థను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. యువత సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేయడానికి తోడుగా క్రీడలు, ఇతర రంగాలలో దృష్టిని సారిస్తే ఎంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉత్తమమైన అవకాశాలను అందించడానికి ముందుకు సాగుతోందని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శాసనసభమండలి సభ్యురాలు సురభివాణి దేవి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు ఆధునాతన కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వడం విశేషమన్నారు. రాష్ట్ర యువజనసర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ మాట్లాడుతూ.. యువతీ యువకుల్లో నైపుణ్యత పెంచుకోవడానికి సెట్విన్ లాంటి సంస్థలు దోహదం చేస్తాయన్నారు. నాణ్యమైన శిక్షణ అందించి పదవంది మంది నిరుద్యోగయువతీ యువకుల జీవితంలో స్థిరపడేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ మీర్ రెహ్మత్ అలీ బేగ్ ఖాద్రి మాట్లాడుతూ సెట్విన్‌కు ఎంతో చరిత్ర ఉందని, పాతబస్తీలో ఈ సంస్థను నాటి ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కోసం స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయడం విశేషమన్నారు. వీటి ద్వారా యువత అన్నిరంగాల్లో ముందుకు సాగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కే శివారెడ్డి మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడుచుకుంటూ అందివచ్చిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. సెట్విన్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ చేనేత వస్త్రాలు పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, గొల్లభామ చీరలను ఉపయోగించి సెట్విన్ కు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు సంప్రదాయ ఫ్యాషన్ షోతో పాటు సంస్థ బ్యూటీషియన్ విద్యార్థులచే బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షో కూడా అద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా సంస్థ నూతనంగా చేపట్టబోయే కొత్తకోర్సులను, ఆన్లైన్ తరగతులకు సంబంధించిన రూపొందించిన వెబ్ పోర్టల్ ను ప్రారంభించారు. అనంతరం వివిధ కోర్సులలో శిక్షణ పొందిన ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఎకౌంట్స్ ఆఫీసర్ సురేశ్ బాబు, తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్మోహన్ రెడ్డి జువ్వాడి శ్రీచరణ్, కోశాధికారి బలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, చిత్రంలో యువజన సర్వీసులలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ఎమ్మెల్సీలు సురభి వాణి దేవి, మీరు రహమత్ బేగ్ ఖాద్రి తదితరులు


సెటిల్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టబోయే కోర్సులకు సంబంధించిన బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, చిత్రంలో యువజన సర్వీసులో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణి దేవి, మీరు రహమత్ బేగ్ ఖాద్రి , సెట్విన్ ఎండి కే వేణుగోపాలరావు తదితరులు



## ప్రజా ప్రతినిధులను గౌరవించే సంప్రదాయం సీఎం రేవంత్ రెడ్డి నేర్చుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వంలో అని వ్యవస్థలు అస్థ వ్యస్థం అయ్యాయి

ప్రోటోకాల్ పాటించలేదు అంటూ నేలపై కూర్చొని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరసన

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రోటో కాల్ పాటించకుండా ప్రజలచే ఎన్నుకున్న ఎమ్మెల్యేలను అగౌరపరుస్తున్నారని, ప్రజా ప్రతినిధులను గౌరవించే సంప్రదాయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేర్చుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే పురం డివిజన్లోని ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాలు 2024
దేవాలయాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తోపాటు ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరు పార్టీ నాయకులు ఒకసారిగా స్టేజి వద్దకు వచ్చేసరికి ఘర్షణ వాతావరణం తలెత్తి ప్రోటోకాల్ సమస్యతో ఇరు పార్టీ నాయకులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో అధికారుల తీరుకు నిరసనగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా లబ్ధిదారులు మాత్రమే లోపలికి అనుమతిస్తారని పోలీసులు చెప్పడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ లేని వ్యక్తులను వేదికపై ఆహ్వానించవద్దని అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి కార్యక్రమం వద్దనే బైటయించి నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపాటు ఓడిపోయిన అభ్యర్థి కూడా స్టేజ్ మీద ఉన్నారంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కొడంగల్‌లో ఓడిపోయిన అభ్యర్థిని కూడా తీసుకువచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ఒక చట్టాన్ని తీసుకురావాలన్నారు. ప్రజలకందాల్సిన పథకాలు సామరస్యంగా ఇవ్వాలని, ప్రజలు అన్ని గమనిస్తూ ఉన్నారన్నారు. బోనాల ఉత్సవాలకు నిధులు ఇవ్వాలని శ్రీకారం చుట్టిందే కేసీఆర్ అన్నారు. 60,000 ఓట్లతో తనపై ఓడిపోయిన కిచెన్నగారి లక్ష్మారెడ్డిని స్టేజిపై తీసుకువచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో కూర్చోబెట్టడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్టే అన్నారు. ఓడిపోయిన వారిపై ప్రేమ ఉంటే వారి పార్టీ కార్యక్రమాల్లో వాడి నెత్తిపై కూర్చోబెట్టుకొని ఊరేగొచ్చని అన్నారు. రాష్ట్ర మొత్తంలో ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లిన ప్రోటోకాల్ సమస్య తల ఎత్తుతుందని, ఈ విషయంలో స్పీకర్ కలగజేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు వేణు గోపాల్ మాట్లాడుతూ స్వయంగా ఎమ్మెల్యేతో మాట్లాడి స్టేజ్ పైన కూర్చోవాలి అని చెప్పిన ఏమి బాధ ఉందో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్టేజ్ పై కూర్చో లేదన్నారు. ఈ నిరసన లోనే మహేశ్వరం నియోజకవర్గము మంజూరు అయిన 34 చెక్ లను మాజీ ఎమ్మెల్యే కీచెన్న గారి లక్ష్మారెడ్డి, బడంగ్ పేట్ మేయర్ పారిజాత, చల్లా నరసింహ రెడ్డి, టి పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, దేవాదాయశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రతినిధులతో కలిసి పలు ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సాజిద్, బేర బాలకిషన్, మహేందర్ యాదవ్, బండి మధు సుధన్ రావు, కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి - బండి రమేశ



**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ బండి రమేష్ పుట్టినరోజు సందర్భంగా కెపిహెచ్బి విద్యుత్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బండ్ రమేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి జన్మదిన రోజున మొక్కలు నాటాలని, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, సోమవారం బల్కంపేట అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- విశ్వంభర, కూకట్ పల్లి


కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసిన భాజపా కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, శ్రీకర్ రావు, వినోద్ కుమార్ గౌడ్, గోపి, సన్నీ
- విశ్వంభర, కూకట్ పల్లి


కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్ జన్మదినం సందర్బంగా వారి నివాసంలో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం
- విశ్వంభర, కూకట్ పల్లి

# బోడుప్పల్ మేయర్‌గా అజయ్ యాదవ్

○ కుంటుబడిన వ్యవస్థను సరిచేస్తా: మేయర్ అజయ్ యాదవ్



**విశ్వంభర, మేడిపల్లి :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త మేయర్‌గా తోటకూర అజయ్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రశాంతంగా అధికారి వెంకట ఉపేందర్రెడ్డి (ఆర్డీఓ) అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రెసైడింగ్ అధికారి వెంకట ఉపేందర్ రెడ్డి తొలుత మేయర్ ఎన్నికపై ఎజెండా అంశాన్ని ప్రకటించగా మేయర్ అభ్యర్థిగా తోటకూర అజయ్ యాదవ్ ను 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి ప్రతిపాదించగా, 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ బలపరచడంతో పాటు మెజార్టీ కార్పొరేటర్లు అజయ్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించారు. దీంతో మేయర్గా తోటకూర అజయ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి ఉపేందర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. అయితే డిప్యూటీ మేయర్ ఎన్నికల విషయంలో ఇద్దరు కార్పొరేటర్లు బొమ్మ కళ్యాణ్ కుమార్ కు కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో డిప్యూటీ మేయర్ ఎన్నిక కాసేపు ఆలస్యమైందని ఇద్దరినీ సముదాయించిన పార్టీ పెద్దలు ఒకరిని పోటీ నుంచి తప్పుకునేలా ఒప్పించినట్లు తెలిసింది.చివరకు డిప్యూటీ మేయర్ గా కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ను మూడవ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ ప్రతిపాదించగా ఐదవ డివిజన్ కార్పొరేటర్ సింగరెడ్డి పద్మారెడ్డి బలపరిచారు. దీంతో సభ్యులంతా డిప్యూటీ మేయర్గా కొత్త స్రవంతి కిషోర్ గౌడ్లు ఎన్నుకుంటామని ప్రకటించారు. మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నికైన తోటకూర అజయ్ యాదవ్ కు స్రవంతి కిషోర్ గౌడ్ లకు తోటి కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ కొత్త మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ మల్లారెడ్డి చేసిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తామని కొత్త మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్పష్టం చేశారు. 4 సంవత్సరాల కాలంలో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజలు అరాచక పాలన అనుభవించారని దీంతో కార్పొరేషన్ లో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజాపాలన అందిస్తామని, ప్రత్యేక కృషి చేస్తామని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా కార్పొరేషన్లు చిన్న వ్యాపారులపై జరుగుతున్న దోపిడిని అరికట్టడానికి, ఇకనుంచి థాయ్ బజార్ రద్దు చేస్తున్నామని కొత్త మేయర్ అజయ్ యాదవ్ ప్రకటించారు. కార్పొరేటర్లు ప్రజల సహకారంతో రానున్న కాలంలో కేవలం అభివృద్ధి మరియు సంక్షేమం దిశగా బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న ఎస్ఎన్డిపి పనులను పూర్తి చేస్తామన్నారు. వాటితో పాటు కార్పొరేషన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ప్రత్యేక నిధులను మంజూరు చేపిస్తామని తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డికి వినిపించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని, తమపై నమ్మకం ఉంచి మేయర్గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్పొరేటర్లకు అజయ్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్గౌడ్, బింగి జంగయ్య యాదవ్, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి ,ముఖ్య సుమన్ నాయక్, మోదుగు లావణ్య శేఖర్ రెడ్డి, గుర్రాల రామ వెంకటేష్ యాదవ్, రసాల వెంకటేష్ యాదవ్, సింగిరెడ్డి పద్మా రెడ్డి, బొమ్మకు సుగుణ, మహేశ్వరి, కొత్త దుర్గమ్మ, దానగళ్ళ అనిత యాదగిరి, జక్కల పద్మాల తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంప్రదాయ వైద్యంపై నాలుగో ప్రపంచ కాంగ్రెస్

○ జులై 28న భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో ఈవెంట్
○ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇంటర్నేషనల్ హోస్టింగ్ ప్రపంచంలోనే ప్రముఖ ఇంటర్నేషనల్ తెలంగాణల హైదరాబాదులో సాంప్రదాయ వైద్యంపై ప్రొఫెసర్, డాక్టర్. దీపక్ రాత్ చైర్మన్, డాక్టర్ వంశీకృష్ణ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నాలుగవ ప్రపంచ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. 2035 వరకు రోగరహిత ప్రపంచంగా మార్చాలన్నదే వారి ఉద్దేశం అని తెలిపారు. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని సాంప్రదాయ వైద్యంలో అనారోగ్యాల నివారణ. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ జూలై నా భారతీయ విద్యా భవన్ ఆడిటోరియం భాస్కర్ భాగ్, హైదరాబాద్ లో ఈవెంట్నీ నిర్వహించబోతున్నామని, ఈవెంట్ ని గ్లోబల్ బుక్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంగ్లాండ్ దేశస్థులు అధికారికంగా ప్రకటించారని, పది రోజులలో వివిధ రకాల కళాభాలతో సాంప్రదాయ వైద్యంతో ప్రపంచంలోని ప్రముఖ అంతర్జాతీయ సమావేశం వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని ఉచిత ఆరోగ్య శిబిరం, వేపచెట్ల పెంపకం, నైపుణ్య అభివృద్ధి, వర్క్ షాప్, క్లినికల్ రీసెర్చ్ ట్రైనింగ్, డిస్కషన్ ట్రెడిషనల్ ఇరిడాలజీ వర్క్ షాప్, అనేక రకాలైన చికిత్సలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా 28వ తేదీన అవార్డు వేడుకలు ర్యాలీలు అంతర్జాతీయ శిరో ప్రాక్టికల్ వర్క్ షాప్ కూడా నిర్వహిస్తున్నామని ఇది ఉచితంగా ప్రతి ఒక్కరూ అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోడ్ ఫౌండేషన్ డాక్టర్ అండ్ డెక్కర్ శ్రీనివాస్, డాక్టర్ ఝాన్సీ రాణి, డాక్టర్ గీత నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐఎసిఈ సంస్థ దిక్సూచిగా నిలుస్తుంది

చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థులకు ఐఎసిఈ సంస్థ దిక్సూచిగా నిలుస్తుంది అని, పరిక్ష ఏదైనా ఫలితం ఐఎసిఈ తోనే సాధ్యం అని సంస్థ చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఐఎసిఈ సంస్థల విజయోత్సవం సత్యసాయి మండపంలో వేలాది మంది విద్యార్థుల సమక్షంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంస్థ చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పరీక్ష ఏదైనా ఫలితం ఐఎసిఇతోనే సాధ్యమని, మా విద్యార్థులు నిరూపించారని అని అన్నారు. ఉద్యోగ సాధనలో విద్యార్థులు వేసే ప్రతి అడుగులో చివరి వరకు సంస్థ తోడుగా ఉంటూ ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** వనస్థలిపురం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు జనరల్‌బాడీ సమావేశం ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం, 1996 భవన, ఇతర నిర్మాణ కార్మికుల సమగ్ర కేంద్ర చట్టాలను రక్షించాలన్నారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణంలో వాడే ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, పెయింట్ వంటి ముడి సరుకుల ధరలను నియంత్రించాలన్నారు. కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని, అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన మోటార్ సైకిల్ను నిర్మాణ కార్మికులకు వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేలాది నష్టపరిహారాలకు తక్షణమే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణానికి ప్రస్తుతం ఇస్తున్నరూ.6 లక్షలను రూ.10 లక్షలకు పెంచాలని, సహజ మరణానికి ఇస్తున్న లక్ష రూపాయలను రూ.5 లక్షలకు పెంచాలి పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఏఎల్ఓ, ఏసీఎల్, డిసిఎల్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, 2009 నుంచి నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు యుద్ధ ప్రాతిపదికన రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆలేటి ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బూసరాజు కాశయ్య, కుశనపల్లి వీరన్న, కుక్కమూడి వెంకటయ్య, కార్యదర్శి పొట్టి పాక రామస్వామి, కోశాధికారిగా సంసాన్, సహాయ కార్యదర్శిలుగా చుక్క రాములు, ఐతరాజు, అంజయ్య, బాపనపల్లి నాగరాజు, ఆర్గనైజర్ అంజి గౌడ్, మునగాల వెంకటేష్, పేరవాలా అంజయ్య, రాధమ్మ, అంజమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



# కులగణన చేసే వరకు పోరు ఆపేది లేదు

- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే యాత్ర
- వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దమాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణగౌడ్ మాట్లడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీనిచ్చిందన్నారు. ఇచ్చిన హామీని ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి పెంచడానికి, బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్ర ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు ఉంటుందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 18న హన్మకొండ హంటర్ రోడ్ సత్యం కన్వెన్షన్ హాల్‌లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులందరూ, కులాల కతీతంగా, పార్టీలకతీతంగా ఏకమై సమగ్ర కులగణన సాధన యాత్ర సభలో అత్యధికంగా పాల్గొని, బీసీల ఐక్యతను చాటలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బచ్చు ఆనందం, దాడి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, బీసీ మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేల శోభరాణి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, డా. ఒడితల రాము, అరేగంటి నాగరాజు, కురిమిళ్ల శ్రీనివాస్ గౌడ్, మారగోని రవి, తంగళ్లపల్లి రమేష్, పెరుమాండ్ల అనిల్, రాధిక, ప్రమోద, కాశెట్టి రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫామ్ మొక్కలు రైతులకు లాభదాయకం

### - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**విశ్వంభర, ఆమనగల్లు/కల్వకుర్తి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయాన రైతు అయినందున రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఆయిల్ ఫామ్ మొక్కలను అందించి లాభాల బాటలో పాయనించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టంలో వనమహోత్సవం సందర్భంగా మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్‌లో భాగంగా సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే ఆయిల్ పామ్ మొక్కను నాటారు. ఆయిల్ ఫాం పంట ఒకసారి నాటుకుంటే నాలుగో సంవత్సరం నుంచి 30 సంవత్సరాల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. చీడ, పీడల బెడద తక్కువగా ఉంటుందని, అకాల వర్షాలు వడగండ్లు ఈ పంటపై ఎలాంటి ప్రభావం చూపదని, అంతర పంటలతో రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఆయిల్ పామ్ చట్టం 1993 ప్రకారం ఈ పంటను ఎలాంటి మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ పంట టన్ను ధర కూడా ప్రతినెలా ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. ఈ పంట ఒక మొక్క 193 రూపాయలు కానీ ప్రభుత్వం కేవలం 20 రూపాయలకే రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి డీ చక్రపాణి, కల్వకుర్తి ఉద్యాన అధికారి ఇమ్రాన్, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంచనారసింహుని ఆలయంలో సోమవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదాద్రి కొండ చుట్టూ సామూహిక గిరి ప్రదక్షిణ చేశారు. లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ సిబ్బంది అధికారులు, స్థానికులు వేలాది మంది భక్తులు, ఎమ్మెల్యే కూతుర్లు అఖిల, శృతి కొండ చుట్టూ సామూహిక గిరి ప్రదక్షిణ చేపట్టారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్రత మండపం వద్ద మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని సైదాపూర్ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ బావమరిది సాయి ఇటీవల యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. వారిని హైదరాబాద్‌లోని సాయి హాస్పిటల్‌లో సోమవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భీక్షమయ్య గౌడ్, లోడి శ్రీనివాస్‌లు పరామర్శించారు.
- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

## కమిషనరేట్‌లో యాంటీ నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు

- డ్రగ్స్ సరఫరా వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలు
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**విశ్వంభర, ఖమ్మం :** డ్రగ్స్ సరఫరా వినియోగాన్ని సమూలంగా నిర్మూలించ డానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత భలోపేతం చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా వినియోగం నియంత్రణపై ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. ప్రధానంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీ అడిక్షన్ ప్రి వెన్షన్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ శాఖ యాంటి నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి సమాచారం వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. మాధకద్రవ్యాల క్రయ విక్రయాల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వాట్సప్ ద్వారా కాని సెల్ ఫోన్ ద్వారా ఫిర్యాదులు సమాచారం అందజేసేందుకు అందుబాటులో వుండే యాంటీ డ్రగ్ కంట్రోల్ విభాగం 8712659123 సెల్ ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం అందజేసిన వారి వివరాలకు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పల్లెల్లో ర్యాలీలు సదస్సులు నిర్వహించి డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. అటు గంజాయి వాడుతున్న వారిని సైతం గుర్తించి వైద్య సదుపాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్ చత్తీస్‌గఢ్ నుంచి రోడ్డు మార్గాల ద్వారా మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా తనిఖీలు పటిష్ఠం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## కూరెల్ల - రాఘవపురం గ్రామల మధ్య మూసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి




### సీపీఎం పార్టీ డిమాండ్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాగును సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ.. నిత్యం రహీంఖాన్ పేట, నర్సాపురం మరియు రాఘవపురం గ్రామాల ప్రజలు ఈ మూసీ వాగు నుంచి అనేక మంది తమ అవసరాల కోసం ప్రయాణిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో వాగులోని నీళ్లు వంతెనపై నుంచి పోవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని, గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేకు, మంత్రికి పలు సందర్భాల్లో వినతి పత్రం ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వాగుపైన వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే రహీంఖన్ పేట నుంచి నర్సాపురం వరకు డబల్ రోడ్డు వేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలన్నింటిపై రాబోయే కాలంలో నిర్వహించే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, గ్రామ శాఖ కార్యదర్శి తూమ్మలగూడెం యాదయ్య, సిపిఎం నాయకులు, బి రాములు, బి ఐలయ్య, రేసు యాది రెడ్డి, పొన్నం రాజామల్లు, ఎం సత్తయ్య, కే అంజయ్య, కే శంకరయ్య, ఎం భిక్షం, పొన్నం అండాలు, ఎడ్ల నర్సిరెడ్డి, ఎన్ ఉప్పలయ్య, బుర్ర రాకేష్, కొంపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**విశ్వంభర, చింతపల్లి :** నిరుపేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని చింతపల్లి ప్రెస్ క్లబ్ అసోసియేషన్ వారు మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి అన్నారు. చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ రి.నె. (336/2024) ఆధ్వర్యంలో హైదరాబాద్ బీ.ఎన్.రెడ్డి నీలాద్రి హాస్పిటల్, మాల్ పద్మావతి హాస్పిటల్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జబ్బు చేస్తే వైద్యం చేయించుకునే స్థోమత లేని నిరుపేదలు మండలంలో చాలా మంది ఉన్నారని, వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచనతో చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్స్ సిద్ధార్థ్, ఆశాజ్యోతి రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్, జనరల్ చెకప్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మండలంలోని 34 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలను ప్రతి మూడు నెలలకు లేదా ఆరు నెలలకు ఒకసారి ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎస్సై యాదయ్య, కో ఆప్షన్ జాంగీర్, మాజీ ఎంపిటిసిలు సదానందం, ఎల్లంకి అశోక్, గోవిందు రవికుమార్ రవి, రియాజ్ పాషా, దాచేపల్లి మధు, వెన్నం శేఖర్, వైద్య సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేష్, ఓంకార్, రాజు, కృష్ణ, ప్రవీణ్, ప్రశాంత్, మణిదీప్, శ్రీకాంత్, సైదులు, ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు భోజన ప్లేట్స్, స్టేషనరీ పంపిణీ

**విశ్వంభర, రామన్నపేట :** రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పివిపియం రావు మెమోరియల్ పీకే మెహర్ (యూఎస్ఏ) వారి సహకారంతో సోమవారం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రితోపాటు భోజన ప్లేట్లు మరియు అంగన్వాడీ విద్యార్థులకు ఆట వస్తువుల కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బెస్ట్ సేవా సొసైటీ గత నాలుగు సంవత్సరాలు నుంచి విద్య, వైద్య, ఉపాధి సామాజిక చైతన్య అంశాల పట్ల అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని, ఇదే స్ఫూర్తితో ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రకాల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. గత 45 సంవత్సరాల క్రితం ఊరిని వదిలి వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఊరుపై ఉన్న మమకారంతో ఉన్న ఊరికి ఏదో ఒక రకంగా సేవ చేయాలనే సంకల్పం దృఢంగా ఉండడం మూలంగానే బెస్ట్ సేవా సొసైటీ అందర్నీ కలుపుకుంటూ ఇంకా అనేక రంగాలలో అభివృద్ధి కొరకు గ్రామంలో అనేక అవకాశాలను కల్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ సేవా సొసైటీ చైర్మన్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్ వేముల సైదులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిల్ల ప్రేమలత, ప్రభావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, రాజన్ బాబు, భద్రయ్య, గణేష్, గోపాల్ రెడ్డి, కృష్ణ, రాజు, రమేష్, స్వప్న, అంగన్వాడీ టీచర్స్ గోవర్ధనమ్మ, యశోద, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి మార్కండేయ దేవస్థానంలో ఘనంగా వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. చివరి రోజు పూజలో అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి వారాహి దేవి, దుర్గ హోమం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగభూషణ శర్మ నిర్వహించి హోమం విశిష్టత తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు యంగలి బాలకృష్ణ, మహిళా అధ్యక్షులు అప్పం అలివేలు, బావుండ్ల సరిత, పద్మశాలి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వీఆర్ ఫౌండేషన్ అవార్డ్స ఫంక్షన్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఆహ్వానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 25వ తేదీన హైదరాబాద్ హబ్సిగూడలోని హోటల్ సుప్రభాత్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో నిష్టాతులై ప్రతిభ కనభరుస్తున్న వారికి ప్రతిభ సేవా అవార్డ్స్ అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని వీఆర్ ఫౌండేషన్ కమిటీ ప్రభుత్వ విప్‌ను కలసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిసియస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ వీఆర్ శ్రీనివాస్ రాజు, ముఖ్య కార్యదర్శి మధుకర్ గౌడ్, జూరీ కమిటీ సభ్యులు ప్రసాద్, అడ్వయిజరీ బోర్డు కమిటీ సభ్యులు కానుగంటి శ్రీశైలం, అడ్వయిజరీ కమిటీ సభ్యులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ప్రభాకర్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రతీ అమ్మ మాట.. అంగన్వాడీల బాట



**విశ్వంభర, చింతపల్లి :** అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో ఐసిడిఎస్ చింతపల్లి ప్రాజెక్ట్ పరిధిలో మండల కేంద్రంలో సూపర్వైజర్ సుగుణ ఆధ్వర్యంలో అదే విధంగా ఘడియ గౌరారం గ్రామంలో సూపర్వైజర్ అంజమ్మ ఆధ్వర్యంలో సోమవారం అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ లావణ్య కుమారి హాజరై మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రజలకు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో నర్సరీ తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. దీనికి ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ టీచర్స్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, అంగన్వాడీ టీచర్స్ పద్మావతి, లక్ష్మి, వెంకటమ్మ, వీణ, అంజలి, వసీమ, పుల్లమ్మ, పిల్లలు, తల్లులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డిండి ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ



**విశ్వంభర, డిండి :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి పలు సమస్యలపై ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 17 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో డానియల్ తెలియజేశారు. మండల కేంద్రంలోని వివిధ సమస్యలపై వంగాల శేఖర్ రెడ్డి దరఖాస్తు చేశారు. ప్రజావాణికి మండల ప్రత్యేక శ్రీలక్ష్మి అధ్యక్షత వహించగా, ఎంపీడీవో డానియల్, డాక్టర్ శైలి, ఏఈ విజయ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక రెడ్డి, ముజీబ్, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



# శరద్ పవార్‌ను కలిసిన అజిత్ అనుచరుడు

**విశ్వంబర, మహారాష్ట్ర:** మహారాష్ట్ర మంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ అనుచరుడు ఛగన్ భుజ్‌బల్ ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌ను సోమవారం కలిశారు. ఆయన నివాసానికి వెళ్లిన భుజ్‌బల్ మరాఠా కోటా, ఓబీసీ నిరసనలపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని శరద్ పవార్‌ను కోరారు. అనంతరం మంత్రి ఛగన్ భుజ్‌బల్ మీడియాతో మాట్లాడారు. శరద్ పవార్‌తో దాదాపు గంటన్నర సేపు సమావేశమైనట్లు తెలిపారు. మరాఠా కోటా, ఓబీసీ నిరసనల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పరిస్థితులు చాలా ఉద్రిక్తంగా ఉన్నాయన్నారు. కాగా, శరద్ పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని ఓబీసీల సమస్యలను పరిష్కరించారని ఛగన్ భుజ్‌బల్ తెలిపారు. అందుకే ఇప్పుడు ఆయన జోక్యాన్ని కోరినట్లు చెప్పారు. సీఎం ఏక్‌నాథ్ షిండే, రాష్ట్రంలోని ఇతర ముఖ్య నేతలతో చర్చించడానికి ఆయన అంగీకరించారని అన్నారు. ఆయనకు ఆరోగ్యం బాగోలేదు కాబట్టి కోలుకోవడానికి రెండు రోజులు అవసరమని చెప్పారన్నారు. అలాగే శరద్ పవార్ విశ్రాంతి తీసుకోవడంతో ఆయనను కలిసేందుకు సుమారు గంటన్నర వేచి ఉన్నానని అన్నారు. మరోవైపు శరద్ పవార్‌ను ఛగన్ భుజ్‌బల్ కలవడం ఎన్సీపీలో చర్చకు దారితీసింది. సీనియర్ నేత అయిన ఆయన అజిత్ పవార్ ఎన్సీపీలో ఇమడలేకపోతున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి.



# డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

### హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకోలేమన్న సుప్రీం

**విశ్వంభర, ఢిల్లీ:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో సోమవారం ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తనపై సీబీఐ దాఖలు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ శివకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడంపై శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. అయితే, ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. కర్ణాటక హైకోర్టు ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు తాము సిద్ధంగా లేమని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ఎస్‌సీ శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. సీబీఐ కేసును రద్దు చేయాలని శివకుమార్ గతంలో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఎలాంటి ఉపశమనం ఇవ్వలేదు. ఈ విషయంలో మూడునెలల్లోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. 201318 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శివకుమార్ మంత్రిగా ఉన్న సమయంలో ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లుగా సీబీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో సీబీఐ 2020 సెప్టెంబర్ 3న కేసు నమోదు చేసింది. ఈ కేసును ఆయన కోర్టులో సవాల్ చేశారు.

# నేపాల్ ప్రధానికి నరేంద్ర మోడీ విషెస్

**విశ్వంభర, ఢిల్లీ:** నేపాల్ నూతన ప్రధాని కేపీ శర్మ ఓలీకి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఎక్స్ వేదికగా మోదీ ఓ పోస్ట్ పెట్టారు. నేపాల్ ప్రధాన మంత్రిగా నియమితులైన ఓలీకి అభినందనలు తెలిపారు. రెండు దేశాల మధ్య స్నేహ బంధాలను మరింత బలోపేతం చేయడం, సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి పరస్పర సహకారంతో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి మూడోసారి నియమితులయ్యారు. నేపాల్‌యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్‌యూఎంఎల్), నేపాల్ కాంగ్రెస్ (ఎన్‌సీ)లతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో కొత్త ప్రధానిగా ఓలిని అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆదివారం నియమించారు. శుక్రవారం ప్రజా ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షలో ప్రధాని పుష్పకుమార్ దహల్ ప్రచండ ఓడిపోవడంతో ఓలి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఓలి, అతని మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఓలి గతంలో 201516, 20182021 కాలంలో ప్రధానిగా పనిచేయగా, ఇప్పుడు మూడోసారి అధికారం చేపట్టనున్నారు. అస్థిరతకు మారుపేరైన నేపాల్‌లో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఓలి ముందున్న అతిపెద్ద సవాల్.



# దేవుడే కాపాడాడేమో

- ట్రంప్ భావోద్వేగం
- దాడి తర్వాత తొలిసారి మీడియా ముందుకు



**విశ్వంభర, యూఎస్:** అమెరికా ఎన్నికల ప్రచార సభలో మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పై గన్ ఫైర్ అటాక్ జరిగిన విషయం తెలిసిందే. దుండగుడు జరిపిన కాల్పుల్లో ఓ బుల్లెట్ ట్రంప్ కుడి చెవిని గాయపరుస్తూ వెళ్లింది. అయితే ఆ ఘటన తర్వాత ఆయన తొలిసారి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పెన్సిల్వేనియాలో జరిగిన హత్యాయత్నం గురించి చెబుతూ.. బహుశా తాను చనిపోయి ఉండేవాడినన్నారు. అదో భయానక అనుభవం అన్నారు. అదృష్టం వల్లో లేక దేవుడి వల్లో తాను బ్రతికి ఉన్నట్లు ట్రంప్ వెల్లడించారు. మిలవాకీలో జరిగిన రిపబ్లికన్ పార్టీ భేటీలో పాల్గొనేందుకు వెళ్లిన ట్రంప్.. అక్కడ న్యూయార్క్ పోస్టుకు ఇంటర్వ్యూ ఇచ్చారు. బహుశా నేను ఇప్పుడు ఇక్కడ ఉండేవాడిని కాదేమో అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్ 5వ తేదీ జరగనున్న దేశాధ్యక్ష ఎన్నికల కోసం అభ్యర్థిని రిపబ్లికన్ పార్టీ కన్వెన్షన్‌లోనే ప్రకటించనున్నారు. దాడి జరిగిన సమయంలో తాను తన తలను సరైన సమయంలో.. సరైన దిశలో మళ్లించినట్లు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. చెవిలోకి దూసుకెళ్లిన ఆ బుల్లెట్ ఈజీగా తన ప్రాణాలను తీసి ఉండేదన్నారు. బహుశా చనిపోయేవాడినని, ఇక్కడే ఉండేవాడిని కాదేమో అని పేర్కొన్నారు. ఆ దాడి సంఘటన మొత్తం నమ్మలేకపోతున్నట్లు తెలిపారు. ట్రంప్‌పై అటాక్ జరిగిన ఘటనలో ఒక ప్రేక్షకుడు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గన్‌మెన్ థామస్ క్రూక్స్‌ను సీక్రెట్ సర్వీస్ హతమార్చిన విషయం తెలిసిందే. తనకు చికిత్సను అందించిన డాక్టర్లు స్పందించారని, ఇలాంటి ఘటనను తామెప్పుడూ చూడలేదని డాక్టర్లు పేర్కొన్నారని, ఇదో అద్భుతం అని ఓ డాక్టర్ చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇది అదృష్టమో లేక దేవుడి దయో.. కానీ చాలా మంది మాత్రం దేవుడి దయ వల్లే తాను బ్రతికి ఉన్నట్లు చెబుతున్నారన్నారు. ముఖంపై రక్తం ఉన్నా.. అటాక్ సమయంలో పిడికిలి బిగించి ఉన్న ఫోటో గురించి కామెంట్స్ వస్తున్నాయని, ఇలాంటి ఫోటోను తాము ఎప్పుడూ చూడలేదని ప్రజలు చెబుతున్నారని ట్రంప్ పేర్కొన్నారు. అవును, వాళ్లు చెప్పింది నిజమే అని, ఎందుకంటే తాను చావలేదన్నారు. అటాక్ జరిగిన తర్వాత కూడా ప్రసంగించాలనుకున్నానని, కానీ సీక్రెట్ షర్వీస్ ఏజెంట్లు తనను ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తన యోగక్షేమాలు తెలుసుకునేందుకు బైడెన్ ఫోన్ చేశారని, ఆ కాల్ గురించి ట్రంప్ మెచ్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తన ప్రత్యర్థిగా బైడెన్ ఉండడాన్ని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.ఇక నుంచి తమ ఇద్దరి మధ్య పోటీ చాలా సివిల్‌గా సాగుతుందని ట్రంప్ చెప్పినట్లు రాశారు.

# కేజ్రీవాల్ కోమాలోకి వెళ్లే ప్రమాదముంది

### ఆప్ నేతల సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై తీహార్ జైలు అధికారులు చేస్తున్న ప్రకటనలను ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ తప్పుపట్టారు. కేజ్రవాల్ ఆరోగ్యం బాగానే ఉందని, కీలక అవయవాలు సజావుగా పనిచేస్తున్నాయని జైలు అధికారులు చెబుతున్నారు. అయితే ఢిల్లీ సీఎం 8.5 కిలోల బరువు తగ్గారని, ఆయన బ్లడ్ షుగర్ లెవెల్స్ పడిపోయాయని సంజయ్ సింగ్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై జైలు అధికారులు విడుదల చేసిన వైద్య నివేదికలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎయిమ్స్ వైద్యుల బృందం కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తోందని, కేజ్రీవాల్ త్వరగా బరువు కోల్పోతున్నారని, లో షుగర్‌తో బాధపడుతున్నారని వైద్యులు గుర్తించారని చెప్పారు. కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ భారీగా పడిపోతున్నదని ఫలితంగా ఆయన కోమాలోకి వెళ్లవచ్చని, లేదా మరణించే ప్రమాదం పొంచిఉందని సంజయ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ మరణానికి కుట్ర పన్నుతున్నారని, అరెస్టయిన రోజున కేజ్రీవాల్ బరువు 70 కిలోలు కాగా, ఆయన బరువు ఇప్పుడు 61.5 కిలోలకు తగ్గిందని చెప్పారు. కేజ్రీవాల్ జీవితంతో చెలగాటం ఆడవద్దని తాను ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. కేజ్రీవాల్‌కు జరగరానిది ఏమైనా జరిగితే కేంద్ర ప్రభుత్వం జవాబు చెప్పేందుకు తడుముకునే పరిస్థితి తలెత్తుతుందని ఆయన హెచ్చరించారు. కాగా, ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రచారం చేసుకునేందుకు సుప్రీంకోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో జూన్ 2న జైలు అధికారుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలసిందే.

# అంజనేరి జలపాతంలో చిక్కుకున్న పర్యాటకులు



**విశ్వంభర, మహారాష్ట్ర:** మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు (heavy rain) పడుతున్నాయి. దీంతో పలు జలపాతాలు జలసవ్వడులతో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ క్రమంలో అంజనేరి జలపాతం వద్దకు వెళ్లి కొందరు పర్యాటకులు వరద తీవ్రతకు అక్కడ చిక్కుకుపోయారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంజనేరి జలపాతం (Anjaneri Waterfall) వద్ద ప్రవాహం పెరిగింది. దీంతో ఆదివారం సెలవు దినం కావడంతో జల సవ్వడులను ఆస్వాదించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు అక్కడికి వెళ్లారు. అదే సమయంలో అకస్మాత్తుగా వర్షం పడి వరద మరింత పెరిగింది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు దాదాపు 6 గంటల పాటు శ్రమించి పర్యాటకుల్ని సురక్షితంగా అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. అంతా ఒకరిచేయి ఒకరు పట్టుకుని నిదానంగా కొండదిగిపోయారు. ఇందుకు సంబంధించిన భయానక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, ఇటీవలే అకస్మాత్తుగా వరద పోటెత్తడంతో రాయ్‌గఢ్ ఫోర్ట్‌లో అనేక మంది పర్యాటకులు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. వారందరినీ కూడా అధికారులు రక్షించారు.

# ఇమ్రాన్ ఖాన్‌కు షాకిచ్చిన పాకిస్థాన్ ప్రభుత్వం



విశ్వంభర, ఢిల్లీ: జైలు శిక్ష అనుభవిస్తున్న తెహ్రీక్‌ఈ ఇన్సాఫ్ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కు పాకిస్థాన్‌లోని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇమ్రాన్ పార్టీ పీటీఐని నిషేధించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆ దేశ సమాచార, ప్రసార మంత్రి అత్తావుల్లా తరార్ సోమవారం ప్రకటించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై పీటీఐని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించినట్లు పాక్ మీడియా పేర్కొంది. పీటీఐని నిషేధించడానికి విదేశీ నిధుల కేసు, మే 9 అల్లర్లు, సైఫర్ ఎపిసోడ్ సహా పలు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తాము విశ్వసిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, రిజర్వ్‌డ్ సీట్ల విషయంలో పీటీఐకి, అక్రమ వివాహం కేసులో ఇమ్రాన్ ఖాన్‌కి ఇటీవలే సుప్రీంకోర్టులో ఉపశమనం కలిగిన విషయం తెలిసిందే. సుప్రీం తీర్పు వెలువడిన రెండు రోజులకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మహిళలు, మైనారిటీలకు రిజర్వు చేసిన సీట్లను కేటాయించేందుకు ఆ పార్టీకి అర్హత ఉందని ఆ దేశ సుప్రీంకోర్టు రెండు రోజుల క్రితం (శుక్రవారం) కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. సుప్రీం తీర్పుతో జాతీయ అసెంబ్లీలో 23 రిజర్వ్‌డ్ స్థానాలను పీటీఐ దక్కించుకుంది. తద్వారా పార్టీ సీట్లు 86 నుంచి 109కి పెరిగాయి. దీంతో పీటీఐ ఆ దేశంలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. 71 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 1996లో పీటీఐని స్థాపించారు. 2018లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. అవిశ్వాస తీర్మానం ఓడిపోవడంతో ఏప్రిల్ 2022లో ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత మాజీ ప్రధానికి పలు కేసుల్లో జైలు శిక్ష ఖరారు కావడంతో.. ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు.`

## కేదార్ నాథ్‌లో 228 కిలోల బంగారం మిస్సింగ్

- జ్యోతిర్‌మఠ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సంచలన ఆరోపణలు

**విశ్వంభర, ముంబై:** ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్‌మఠ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సంచలన ఆరోపణలు చేశారు. కేదార్‌నాథ్‌లో గోల్డ్ స్కామ్ జరిగినట్లు ఆయన ఆరోపించారు. ఆ సమస్యను ఎందుకు లేవనెత్తడం లేదన్నారు. ఢిల్లీలో కేదార్‌నాథ్ లాంటి ఆలయాన్ని నిర్మిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కేదార్‌నాథ్‌లో స్కామ్ చేశారని, ఇప్పుడు ఢిల్లీలో అలాంటి ఆలయాన్ని నిర్మిస్తారా అని అవిముక్తేశ్వరానంద ఆరోపించారు. ఇక్కడ కాకుంటే మరో చోట స్కామ్ జరుగుతుందని, కేదార్‌నాథ్ ఆలయం నుంచి సుమారు 228 కేజీల బంగారం అదృశ్యమైనట్లు ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు ఈ కేసులో దర్యాప్తు జరగలేదన్నారు. దీనికి ఎవరు బాధ్యులు అని ఆయన ప్రశ్నించారు. ఇన్ని రకాల స్కామ్‌లకు పాల్పడి ఇప్పుడు ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయాన్ని కడుతామని అనడడం ఎంత వరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ తనకు ప్రణామాలు చేశారని, తమ దగ్గరికి వచ్చిన వాళ్లను దీవించడం తమ విధానమని అవిముకేశ్వరానంద తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ తమకు శత్రువు కాదు అని, ఆయన శుభం కోరుకునేవాళ్లమని, ఆయన సంక్షేమం గురించి ఆలోచిస్తామని, కానీ ఒకవేళ ఆయన తప్పు చేస్తే, ఆ విషయాన్ని మేం ఎత్తి చూపుతామని అవిముక్తేశ్వరానంద తెలిపారు.

# మారని బైడెన్ తీరు

- మతిమరుపు, తడబాట్లతో విమర్శల పాలు
- డెమోక్రాటిక్ పార్టీకి ఇక్కట్లు



**విశ్వంభర, యూఎస్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాటల తడబాటు కొనసాగుతూనే ఉంది..! ప్రెసిడెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధ్యక్షుడి ప్రవర్తనతో డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర ఆందోళ వ్యక్తమవుతోంది. ఎన్నికల వేళ బైడెన్ తడబడుతుండటం డెమోక్రాట్లకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికే మతిమరుపు, తడబాట్లతో తీవ్ర విమర్శలపాలైన బైడెన్.. తాజాగా మరోసారి అదేపొరపాటు చేసి మీడియాకు చిక్కారు. శనివారం పెన్సిల్వేనియాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడి నేపథ్యంలో బైడెన్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తప్పులు మాట్లాడారు. బ్యాలెట్ బాక్సులకు బదులు బ్యాటిల్ బాక్సులు (యుద్ధపు పెట్టెలు) అని సంభోదించారు. దీంతో అక్కడే ఉన్న డెమోక్రాటిక్ పార్టీ నేతలు తలలు పట్టుకున్నారు. 'నేను మన ప్రజాస్వామ్యం కోసం గట్టిగా మాట్లాడటం కొనసాగిస్తాను. మన రాజ్యాంగం, చట్ట నియమాల కోసం నిలబడతా. అమెరికాలో మా విభేదాల పరిష్కారానికి బ్యాటిల్ బాక్సు (battle box)ను నమ్ముతాం. ఇప్పుడు కూడా మేం వాటిని బ్యాటిల్ బాక్సుల్లోనే పర్కిష్కరించుకుంటాం. బుల్లెట్లతో కాదు' అని వ్యాఖ్యానించారు. అయితే, బ్యాలెట్ బాక్సులు (ballot box) అనడానికి బదులు బ్యాటిల్ బాక్సులు అని తప్పుగా మాట్లాడి మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. దీంతో అధ్యక్షుడి మాటలతో డెమోక్రాటిక్ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్.. యూఎస్ ఉపాధ్యక్షుడు ట్రంప్.. మళ్లీ తడబడిన బైడెన్ బైడెన్ ఇలా తడబాటుకు గురికావడం ఇదేమీ మొదటి సారి కాదు. మీడియా సాక్షిగా వందల సార్లు ఇలానే మాట్లాడారు. తన మతిమరుపు, పొరపాట్లతో అనేకసార్లు హెడ్‌లైన్స్‌లో నిలిచారు. గత వారం నాటో శిఖరాగ్ర సమావేశ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పరిచయం చేస్తున్న సమయంలో 'ఉక్రెయిన్ ప్రెసిడెంట్ పుతిన్..' అని అనేశారు. ఇప్పుడు మైక్‌ను ఉక్రెయిన్ అధ్యక్షుడికి అప్పగిస్తానని, చాలా ధైర్యవంతుడని, లేడీస్ అండ్ జెంటిల్మెన్ అని పలుకుతూ ప్రెసిడెంట్ పుతిన్ అని బైడెన్ పేర్కొన్నారు. ఆ తర్వాత బైడెన్ తన వ్యాఖ్యలను వెంటనే సవరించుకున్నారు. ప్రెసిడెంట్ పుతిన్‌ను ఆయన ఓడిస్తారని, ఆయనే ప్రెసిడెంట్ జెలెన్‌స్కీ అని బైడెన్ తెలిపారు. పుతిన్‌ను ఓడించే అంశంలో తాను కూడా ఫోకస్ పెట్టినట్లు బైడెన్ చెప్పారు.

అదేవిధంగా.. వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ అనబోయి.. ఉపాధ్యక్షుడు ట్రంప్ అని సంభోదించారు. నాటో కూటమి దేశాల వార్షిక సదస్సు ముగిసిన అనంతరం బైడెన్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'మీరు అధ్యక్ష రేసు నుంచి వైదొలిగితే ట్రంప్‌ను కమలా హ్యారిస్ ఓడించగలరని భావిస్తున్నారా..?' అని విలేకరులు బైడెన్‌ను ప్రశ్నించారు. దీనికి అధ్యక్షుడు సమాధానమిస్తూ.. 'అధ్యక్షుడిగా పనిచేసే అర్హతలు ఉపాధ్యక్షుడు ట్రంప్‌కు లేకుంటే నేను అసలు ఆయన్ని ఆ పదవికి ఎంపిక చేసేవాణ్నే కాదు' అంటూ బదులిచ్చారు. అక్కడ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ అనకుండా ట్రంప్ అనడంతో ఇప్పుడు బైడెన్ మానసిక పరిస్థితి మరోసారి చర్చకు దారితీస్తోంది.

మరోసారి అధ్యక్ష రేసులో ఉన్న ఆయనపై ఇప్పటికే తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయన అభ్యర్థిత్వం వదులుకోవాలంటూ సొంత పార్టీలో నిరసన గళాలు అధికం అవుతున్నాయి. ఈ తరుణంలో ఆయన తడబడటం ప్రాధాన్యత సంతరించుకుంది. అధ్యక్షుడి మానసిక స్థితి సరిగా లేదంటూ సోషల్ మీడియాలో పలువురు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.

# ఊరును మింగేస్తున్న సముద్రం

## ఉప్పాడ ప్రజల కన్నీటి గోస

### పట్టించుకోని ప్రభుత్వాలు ○ డిప్యూటీ సీఎం పవన్ పైనే ఆశలు



**విశ్వంభర, విశాఖపట్నం:**

8 గ్రామాలు...1365 ఎకరాలు.. నిన్న మొన్నటి వరకు కళ్ల ముందే కనిపించేవి. కానీ ఇవాళ లేవు. ఇప్పుడున్న ఊళ్లు రేపు ఉంటాయో.. లేదో కూడా అనుమానమే. ప్రభుత్వాలు చేస్తున్న అరకొర ప్రయత్నాలు.. అసంపూర్ణ ఆలోచనలు.. ఆ ఊళ్లను.. ఊళ్లోని జనాలను, వారి ఆస్తుల్ని ఇప్పటి వరకు ఏ మాత్రం ఆదుకోలేకపోయాయి. సముద్రపు అలల ధాటికి ఊళ్లు కొట్టుకుపోతుంటే .. ఆ జనం కన్నీళ్లు కూడా అందులో కలిసిపోతున్నాయి. వారి ఘోష... సముద్రపు ఘోషలో కలిసిపోయి... ఇన్నాళ్లూ పాలకులకు వినిపించకుండా పోయింది.

**ఎలా ఉండాలి..? ఎలా ఉంది..?**

ఇప్పటి వరకు ఆ ఊరి కథను.. చెప్పని పేపరు లేదు... చూపించని టీవీ లేదు... వైరల్ చెయ్యని సోషల్ మీడియా లేదు...బట్ ఏం లాభం...ఇప్పటి వరకు ఆ ఊరి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. అందమైన చీరలపై అలవోకగా జాంధానీ డిజైన్లు అద్దే చేతులు...ఓ వైపు మనోహరమైన సముద్రపు అలల సవ్వడి... ఎటు చూసినా పచ్చదనం... నిజానికి ఆ ఊరి దృశ్యాలు ప్రకృతి గీసిన చిత్రంలా ఉండాలి. ఒకప్పుడు ఉండేది కూడా. కానీ గడిచిన 6 దశాబ్దాలుగా వారి రాత రోజు రోజుకీ మారిపోతోంది. ఎగసి పడే ప్రతి అల.. తమను, తమ ఇళ్లను, తమ ఊరిని మింగేస్తుంటే... తమ బాధ ప్రభుత్వాల ముందు కంఠ శోషగానే మిగిలిపోతూ ఉంటే.. దిక్కు తోచక.. ఆ అలలకు దూరంగా పరిగెడుతునే ఉన్నారు. కానీ విచిత్రమేంటే.. వాళ్లెంత వేగంగా పరిగెడుతుంటే.. ఆ సంద్రం అలలు కూడా అంతే వేగంగా వారిని వెంటబడుతున్నాయి. అలాగని ఊరొదొలి వెళ్లేంత ధైర్యం ఆ జనాలకు లేదు. అదే ఇప్పుడు ఈ తీరానికి లోకువయ్యింది. సముద్రం చొచ్చుకు వస్తున్న కొద్దీ తాము వెనక్కి జరగడమే తప్ప మరో దారి లేకపోవడంతో మత్స్యకారులంతా ఆందోళనలో ఉన్నారు. దశాబ్దిన్నర కిందట, కోత నివారణ కోసం నిర్మించిన జియో ట్యూబ్ కూడా ధ్వంసమయ్యింది.

**సముద్రం కూల్చేస్తున్న ఊరు**

పైన చూస్తున్న చిత్రంలో కూలిపోయిన ఇళ్లు కావవి. పక్కనే కనిపిస్తున్న ఆ సముద్రం కూల్చేసిన ఇళ్లు. ఇప్పటి వరకు 6కి పైగా ఆలయాలు, 3 పాఠశాలలు, రెండు ట్రావెలర్ బంగ్లాలను సముద్రం తనలో కలిపేసుకుంది. ఇక ఇళ్ల లెక్క గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎందుకంటే అలల ధాటికి కూలిపోయినవి ఇళ్లు కావు.. ఈ ఊరి జనం జీవితాలు. వానికి 20 ఏళ్ల క్రితం సముద్రానికి వంద మీటర్ల దూరంలో ఇళ్లు కట్టుకున్న వారికి కూడా ఇప్పుడు తమ ఇళ్లు నిలబడతాయనే ధీమా లేదు. ఇప్పటికే కొన్ని సముద్రం పాలయ్యాయి కూడా. 2011 జనాభా లెక్కల ప్రకారమే 12వేల మంది ఇక్కడ నివసిస్తున్నారు. 3,190 ఇళ్లుండేవి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 137 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన ఈ గ్రామంలో ఇప్పటికే 40 హెక్టార్లకు పైగా భూమి సముద్రంలో కలిసి పోయిందని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. కాకినాడ పోర్ట్ నుంచి సుమారు 12 కి.మీ. దూరంలో ఉన్న ఉప్పాడ మధ్య తీరం చాలాకాలంగా కోతకు గురవుతోంది. దాని కారణంగా బీచ్ రోడ్డు కూడా అనేకమార్లు దెబ్బతింది. పదే పదే రోడ్లు నిర్మించాల్సి వస్తోంది. సముద్రతీరాన్ని కోత నుంచి కాపాడేందుకంటూ జియో ట్యూబ్ పేరుతో ఏర్పాట్లు చేశారు. భారీ బండరాళ్లను సముద్రపు ఒడ్డున వేసి కెరటాల తాకిడి తీరాన్ని తాకకుండా అడ్డుకట్టగా మార్చారు. ఉప్పాడ గ్రామాన్ని ఆనుకుని రాళ్లను పెద్ద వలల్లో వేసి అవి అలల తీవ్రతను నివారించేలా ఏర్పాట్లు చేశారు. నేటికీ బీచ్ రోడ్డులో వేసిన పెద్ద రాళ్లే కోత వేగవంతం కాకుండా నివారించేందుకు దోహదపడుతున్నాయి. కానీ ఉప్పాడ గ్రామాన్ని ఆనుకుని వేసిన ట్యూబ్ మాత్రం పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం ఆనవాళ్లు కూడా మిగలలేదు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో నీటి పారుదల శాఖ నిధులతో ఉప్పాడ గ్రామంలో తీవ్రతను అడ్డుకునేందుకు ఆ జియో ట్యూబ్ ఏర్పాటు చేశారు. అప్పట్లో రూ. 12.6 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేశారు. వాటి ఫలితంగా కొంతకాలం పాటు సముద్రపు కోత నివారణ జరిగింది. తాత్కాలికంగా ఫలితాన్నిచ్చిన ట్యూబ్ ఇప్పుడు ఆనవాళ్లే లేకుండా పోయింది. మొత్తంగా తీరంలో సుమారు 1463 మీటర్ల మేర జియో సింథటిక్ ట్యూబులు, బ్యాగులు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ప్రాజెక్టును మద్రాస్ ఐఐటీ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్మించారు. ఇది ప్రయోగాత్మక ప్రాజెక్టే అయినప్పటికీ తర్వాత దీన్ని మొత్తం ఉప్పాడ గ్రామంలోని తీరమంతటికీ విస్తరించాలన్నది అప్పటి ఆలోచన. అప్పట్లోనే ఈ ప్రాజెక్టు కోసం 135 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టే ఆనవాలు లేకుండా పోయేసరికి... మిగిలిన బడ్జెట్ కేటాయించి.. ఆ ప్రాజెక్టు పూర్తి చేసేంత ధైర్యం ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చెయ్యలేదు. నిజానికి మొదట్లో ఆ జియోట్యూబులు కొంత మేర ఫలితాన్నిచ్చాయి. ఉప్పాడ పరిసర ప్రాంతాల్లో ఏటా సుమారు 1.98 మీటర్ల నుంచి 7.98 మీటర్ల మేర కోతకు గురయ్యే తీర ప్రాంతం.. జియో ట్యూబులు ఏర్పాటు చేసిన తర్వాత సుమారు 6 మీటర్లకు పరిమితం అయ్యింది. కానీ 201415 నాటికి మళ్లీ పరిస్థితులు మొదటికొచ్చాయి. 2016లో వచ్చిన వర్ధా తుపాను ధాటికి కాకినాడఉప్పాడ బీచ్ రోడ్ లో ఏర్పాటు చేసిన జియో ట్యూబులు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత 2019లో వచ్చిన ఫని తుపాను దెబ్బకు సముద్రానికి అడ్డంగా కట్టిన రక్షణ గోడలు బలహీనపడ్డాయి. అయితే దేశంలో ఇతర తీర ప్రాంతాల్లో కూడా ఈ జియో ట్యూబుల ప్రయోగం పెద్దగా ఫలితాన్నివ్వలేదన్న విషయం తర్వాత పరిశోధనల్లో వెల్లడయ్యింది. పశ్చిమ బెంగాల్లోని శంకరపూర్, మహారాష్ట్రలోని దేవ్‌బగ్ అలాగే ధను ప్రాంతాల్లోనూ, గుజరాత్‌లోని అదానీ పోర్టులో, గోవాలోని కండోలిమ్ బీచ్‌లో జియో ట్యూబులు ఏర్పాటు చేసినప్పటికీ వాటి వల్ల పెద్దగా చెప్పుకోదగ్గ ఫలితాలు లేవు. బలమైన సముద్రపు అలల తాకిడికి అవి తాళలేవన్న విషయం కేవలం ఉప్పాడలోనే కాదు, దేశ వ్యాప్తంగా చేపట్టిన చాలా ప్రయోగాల్లో తేలింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉప్పాడ ప్రాంతాన్ని పరిశీలించారు. తీర ప్రాంతం పదే పదే మునకకు గురికావడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా తన నియోజకవర్గ పరిధిలో ఉన్న ఉప్పాడ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొంటానని హామీ ఇచ్చారు.

**మా నమ్మకం నువ్వేనయ్యా!**

అయితే అధికారంలోకొచ్చే ప్రతి ప్రభుత్వమూ ఇదే తీరున హామీలిస్తూ వచ్చిందని, అయితే ఏ ఒక్కరూ తమ సమస్యను పూర్తిగా తీర్చలేకపోయారన్నది మరి కొందరు స్థానికుల వాదన. అయితే ఈ సారి మాత్రం ప్రభుత్వంపై నమ్మకం వారి మాటల్లో కనిపిస్తోంది.

**డిప్యూటీ సీఎం హామీ.. మీకు నేనున్నా**

"ఉప్పాడ ప్రాంతాన్ని వెళ్లి చూసొచ్చా. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఈ విషయమై మాట్లాడాను. సరిగ్గా 18 నెలల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా. దశాబ్దాలుగా కోతకు గురవుతున్న ఉప్పాడ పరిసర ప్రాంతాలకు భవిష్యత్తులో ఆ సమస్య ఇక రానివ్వను. కాకినాడ నుంచి ఉప్పాడ తీరం వరకు అందమైన కోస్టల్ రోడ్‌ను నిర్మిస్తా. అలాగే ఆ ప్రాంతంలో పర్యటకంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వచ్చేలా చేస్తా." ఇవి ఆయన ఉప్పాడలో 2024 జూలై 3న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఇచ్చిన హామీలు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై స్థానికులు చాలా నమ్మకం పెట్టుకున్నట్టు వారి మాటల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా దశాబ్దాలుగా ఉప్పాడ గ్రామం సముద్రంలో కలిసిపోతూ ఉన్నా... ఏ ప్రభుత్వమూ తమకు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేదని, నిత్యం సముద్రపు కోతకు గురయ్యే రోడ్డు బాగు పడితే చుట్టు పక్కల ఊళ్లలో ప్రజల జీవితాలు మారిపోతాయని స్థానికులు చెబుతున్నారు. "నిత్యం సముద్రపు కోతకు గురయ్యే ఈ రోడ్డు బాగుపడితే మా జీవితాలు బాగుపడతాయి. మా జీవనోపాధికి ఈ రోడ్డే ముఖ్యం. నిజంగా ఈ కోస్టల్ రోడ్ ఏర్పాటై.. పర్యటకంగా అభివృద్ధి చెందితే.. వైజాగ్‌లా మారితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది." అన్నది స్థానిక ఆటో డ్రైవర్ మాట.

## ముచ్చుమర్రి బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం


### ప్రకటించిన హోంమంత్రి అనిత



**విశ్వంభర, నంద్యా:** నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలిక మృతదేహం విషయంలో ఇంకా మిస్టరీ వీడటం లేదు. వారం రోజులైనా ఇంకా బాలిక మృతదేహం ఆచూకీ లభించలేదు. నిందితులు రోజుకోరకంగా సమాధానాలు చెబుతుండటంతో ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. కాగా, ఈ ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ముచ్చుమర్రిలో బాలిక మృతదేహం ఇంకా దొరకలేదని తెలిపారు. డెడ్‌బాడీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెతుకుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించారు. ముచ్చుమర్రి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం ప్రకటించారు. విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలంలో ఆరు నెలల చిన్నారిపై అత్యాచార ఘటనపై వంగలపూడి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత చిన్నారి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించారు. ఈ డబ్బును బాధిత చిన్నారి పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని వెల్లడించారు. ఈ ఘటనలపై స్పెషల్ కోర్టు ఏర్పాటుకు సీఎం ఆదేశించారని చెప్పారు. తప్పు చేసింది ఎవరైనా సరే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు కూతుళ్లు. ఆరు నెలల వయసున్న తన చిన్న కూతుర్ని ఊయలలో పడుకోబెట్టి.. ఆమె దగ్గరలోని కిరాణ దుకాణానికి వెళ్లింది. ఇది గమనించిన నార్లవలస గ్రామానికి చెందిన బోయిన ఎరకన్న దొర ఇంట్లోకి వెళ్లి ఆ చిన్నారిపై అత్యాచారం చేశాడు. దీంతో ఆ పాప గట్టిగా ఏడ్చింది. ఇది విన్న చిన్నారి వాళ్ల అక్క అక్కడకు వెళ్లి ఆ దారుణాన్ని చూసింది. వెంటనే కిరాణానికి వెళ్లిన తల్లి దగ్గరకు వెళ్లి జరిగిందంతా చెప్పింది. దీంతో తల్లితో పాటు స్థానికులు అందరూ ఆగ్రహంతో వెళ్లారు. అది గమనించిన ఎరకన్న దొర అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం రక్తస్రావమైన చిన్నారిని బాడంగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చిన్నారి క్షేమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా గ్రామానికి వెళ్లి స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం నార్లవలసకు వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారు.

## నిరూపిస్తే ఉరేసుకుంటా నేను అవినీతి చేయలేదు

### పవన్ కల్యాణ్ కు బాలినేని సవాల్



**విశ్వంభర, ప్రకాశం:** వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిని మారుస్తారనే కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. ప్రకాశం జిల్లా బాధ్యతలను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అప్పగిస్తారని తెలియడంతో.. తాను పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తాను జనసేనలో చేరుతున్నానని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నేను పార్టీ ఎందుకు మారతానంటూ ప్రశ్నించారు. ఒంగోలును విడిచిపెట్టే ప్రసక్తే లేదని.. ఇక్కడే ఉంటానని బాలినేని తెలిపారు. వేరే జిల్లా నేతను అధ్యక్షుడిగా ఎందుకు నియమించడం? ఈ జిల్లాలో నాయకులు లేరా? అని పార్టీ అధినేత జగన్‌ను ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాలో నాయకులకు కొదవ లేదని తెలిపారు. అధ్యక్ష పదవిని జిల్లాకు సంబంధించిన వ్యక్తులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనను హవాలా మంత్రిగా కూటమి నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని బాలినేని మండిపడ్డారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కావాలంటే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా విచారణ జరిపించుకోవచ్చని సవాలు విసిరారు. తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే ఉరేసుకుంటానని స్పష్టంచేశారు.

## జిరాక్స్ కోసం వెళ్తే అత్యాచారం



**విశ్వంభర, అనంతపురం:** ఆంధ్రప్రదేశ్‌లో కామాంధులు రెచ్చిపోతున్నారు. ముచ్చుమర్రి, విజయనగరం ఘటనలను మరువకముందే మరో దారుణం వెలుగులోకి వచ్చింది. జిరాక్స్ సెంటర్‌కు వెళ్లిన ఎనిమిదో తరగతి బాలికపై నిర్వాహకుడు అత్యాచారానికి యత్నించాడు. భయాందోళనలకు గురైన ఆ బాలిక పెట్టిన కేకలకు స్థానికులు స్పందించడంతో దారుణం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం జిల్లాలోని శింగనమల నియోజకవర్గం నార్పల మండలం కేంద్రంలోని మసీదు సమీపంలో నాగరాజు (45) జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. అదే మండలానికి చెందిన ఎనిమిదో తరగతి దళిత విద్యార్థిని ఆధార్ కార్డు జిరాక్స్ కోసం అక్కడికి వెళ్లింది. ఒంటరిగా రావడాన్ని గమనించిన నిర్వాహకుడు నాగరాజు విద్యార్థిని లోపలికి రా అని పిలిచాడు. అలాగే లోపలికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ హఠాత్పరిణామంతో బెంబేలెత్తిపోయిన బాలిక గట్టిగా కేకలు పెట్టింది. అరుపులు విన్న స్థానికులు అక్కడకు వచ్చి బాలికను రక్షించారు. జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజుకు దేహశుద్ధి చేశారు. అనంతపురం జిల్లాలో అత్యాచార యత్న ఘటనపై ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వైసీపీ తీవ్రంగా మండిపడింది. చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ అత్యాచారాంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించింది. మొన్న నంద్యాల, నిన్న విజయనగరం, నేడు అనంతపురం బాలికలపై వరుసగా అఘాయిత్యాలు జరుగుతున్నా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు నాగరాజుకు దేహశుద్ధి చేస్తున్న వీడియోను పోస్టు చేసింది. కాగా, నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలిక మృతదేహం విషయంలో ఇంకా మిస్టరీ వీడటం లేదు. వారం రోజులైనా ఇంకా బాలిక మృతదేహం ఆచూకీ లభించలేదు. నిందితులు రోజుకోరకంగా సమాధానాలు చెబుతుండటంతో ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. ఇదిలా ఉంటే విజయనగరం జిల్లా రామభద్రపురంలో ఆరు నెలల చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. ఈ రెండు ఘటనలు ఏపీలో సంచలనం సృష్టించడంతో హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం స్పందించారు. ఈ రెండు కేసుల్లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని వెల్లడించారు. తప్పు చేసింది ఎవరైనా సరే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అలాగే ముచ్చుమర్రి బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు, విజయనగరం బాధిత చిన్నారికి రూ.5లక్షలను సాయంగా ప్రకటించారు.

## జనసేన గెలుపు దేశంలోనే సంచలనం


- కూటమి గెలుపుకు జనసేన నిర్ణయమే కీలకం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విశ్వంభర, మంగళగిరి:** దేశంలో మన గెలుపు ఓ కేస్ స్టడీగా మారిందని జనసేన కార్యకర్తలతో ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పోటీ చేసిన ప్రతి స్థానంలో గెలిచామని అన్నారు. మనం సాధించిన గెలుపు ఎంతో గొప్పది అని పేర్కొన్నారు. కూటమి విజయానికి మనం తీసుకున్న నిర్ణయమే కీలకమని తెలిపారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పవన్ కల్యాణ్ సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్వేచ్ఛ ఉండేది కాదని విమర్శించారు. గతంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదన్నారు. సోషల్‌మీడియాలో పోస్టు పెట్టాలంటే భయపడాల్సిన దుస్థితి అన్నారు. మన ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితులు చూశామని తెలిపారు. పార్లమెంటు సభ్యుణ్ని బంధించి కొట్టించిన తీరు చూశామని పేర్కొన్నారు. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్రబాబును కూడా జైల్లో పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూకుంభకోణాలు చూశామన్నారు. అందుకే ఐదే కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని తెలిపారు. జనసేన తరఫున పోటీ చేసిన మొత్తం 21 మందిని ప్రజలు గెలిపించారని అన్నారు. పోటీ చేసిన చోటే కాదు.. పోటీ చేయని చోట్ల వీర మహిళలు, జనసైనికులు తీవ్రంగా పోరాడారని వారిని ప్రశంసించారు. బాధ్యతలు మోసే ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసైనికులు, వీరమహిళలు తనవైపు బలంగా నిలబడ్డారని.. ఎలాంటి పదవి ఆశించకుండా పోరాడారని పేర్కొన్నారు. ఎంత సాధించినా తగ్గి ఉండటం చాలా అవసరమన్నారు. ఊహించని మెజార్టీతో గెలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం అవుతానని అనుకోలేదని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా తెలిపారు. భారీ విజయంతో జనసేన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ప్రధాని మోదీ మనసులో తనకు స్థానం ఉందని తెలిపారు. అందుకే వెంటనే ప్రధాని మోదీని కలవలేదని చెప్పారు. ఎంత సాధించినా.. తగ్గి ఉండటం మంచి అలవాటు అని అన్నారు. జనసేన ఓటింగ్ శాతం భారీగా పెరిగిందని తెలిపారు.

## నాపై దుష్ప్రచారం చేస్తే వదలను

- వైసీపీ నేతలైనా విడిచిపెట్టను
- విజయసాయిరెడ్డి వార్నింగ్



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలోని కొత్త ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆరోపించారు. వైసీపీ నేతలపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాక్షస పాలనను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వైజాగ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్లాన్ ప్రకారం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. తన పేరు, ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారు ఎంతటి వారైన వదిలిపెట్టమని హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేది తమ పార్టీ వాళ్లయినా సరే వదలనని అన్నారు. తనను భయపెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నామని వెనక్కి తగ్గమని అన్నారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఎన్నికలు జరిగినా మేమే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేవారు. అధికారంలోకి వస్తాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. ఓ ఆదివాసీ మహిళకు ద్రోహం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీలోని కొందరు కూడా తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నాపై కుట్రలు చేస్తున్న వాళ్లందరికీ బుద్ధి చెబుతానని అన్నారు. వీరిపై పార్లమెంట్‌లో ప్రివిలేషన్ మోషన్ ఇస్తా.. పరువు నష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడతానని చెప్పారు.

## విజయసాయిరెడ్డితో నాకు సంబంధం లేదు

- మదన్ మోహన్ తో బిడ్డను కన్నాను
- ఎఫైర్ వార్తలపై స్పందించిన కె.శాంతి

**విశ్వంభర, విశాఖపట్నం:** భర్త విదేశాల్లో ఉండగానే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి గర్భం దాల్చిందనే వార్త రెండు రోజులుగా ఏపీలో రెండు రోజుల క్రితం సంచలనం సృష్టించింది. తన భార్య ప్రెగ్నెన్సీకి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది సుభాష్ కారణమని ఆమె భర్త మదన్‌మోహన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై కె.శాంతి స్పందించారు. విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విజయసాయిరెడ్డితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మదన్‌మోహన్ మానిపాటితో 2013లో తనకు వివాహమైందని.. ఆయనతో ఇద్దరు బిడ్డలను కన్నానని కె.శాంతి తెలిపారు. ఆయన వేధింపులు భరించలేక గిరిజన సంప్రదాయ ప్రకారం 2016లోనే విడాకులు తీసుకున్నానని పేర్కొన్నారు. 2020లో న్యాయవాది సుభాష్‌ను పెళ్లి చేసుకున్నానని, ఆయనతోనే ఒక బిడ్డను కన్నానని చెప్పారు. మరొకరి భార్యను అని తెలిసి కూడా మదన్‌మోహన్ తనను తీవ్రంగా వేధించాడని, కోట్ల రూపాయలు సంపాదించి తనకు ఇవ్వాలని ఒత్తిడి చేసేవాడని చెప్పారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని తాను వైజాగ్‌లోనే చూశానని.. ఆయనతో శాఖాపరమైన అంశాలు మాత్రమే చర్చించానని కె.శాంతి తెలిపారు. విజయసాయిరెడ్డితో తనకు సంబంధం అంటకడుతున్నారని.. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డితో నాకు సంబంధం అంటగట్టడానికి సిగ్గులేదా? ఆయన వయసుకు అయినా గౌరవం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఒకవేళ నేను చనిపోతే నాపై ఆరోపణలు చేసిన వారే నా చావుకు కారణమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి తనకు తండ్రిలాంటి వారని.. దయచేసి ఆయనతో తనకు సంబంధం అంటగట్టకండి అని విజ్ఞప్తి చేశారు. తన సస్పెన్షన్ అంశంపై కూడా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి స్పందించారు. అవినీతి ఆరోపణలతో పాటు ఉద్యోగుల్లోనూ తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆమెను విధుల్లో నుంచి తొలగించామని అధికారులు చెప్పారు. అయితే ఈ ప్రచారాన్ని కె.శాంతి ఖండించారు. గిరిజన మహిళ కాబట్టే తనను వేధిస్తున్నారని తెలిపారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు.

## డేవిడ్ వార్నర్‌కు ఆ జెర్సీ శాశ్వతంగా దూరం



**విశ్వంభర, ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనంపై ఆశలు పెట్టుకున్న ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ కు పెద్ద షాక్. వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ ఆడాలనుకున్న అతడి కల ఫలించేలా లేదు. అవును.. చాంపియన్స్ ట్రోఫీ కోసం వార్నర్‌ను పరిగణనలోకి తీసుకోవట్లేదని ఆసీస్ జాతీయ సెలెక్టర్ జార్జ్ బెయిలీ తెలిపాడు. దాంతో, డేవిడ్ భాయ్ మళ్లీ పసుపు జెర్సీ వేసుకోవడం ఇక అసాధ్యమే అని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. 'వార్నర్ రిటైర్ అయ్యాడని మాకు తెలుసు. అయితే.. సుదీర్ఘ కెరీర్‌లో మూడు ఫార్మట్లలో ఎన్నో ఘనతలు సాధించిన అతడిని మేము అభినందిస్తున్నాం. ఆస్ట్రేలియా క్రికెట్‌కు వార్నర్ చేసిన సేవను కొనియాడుతున్నాం. కానీ, పాకిస్థాన్‌లో జరుగబోయే చాంపియన్స్ ట్రోఫీలో వార్నర్ ఉండడు. ఎందుకంటే.. జట్టులోకి కొత్త ఆటగాళ్లు వస్తున్నారు. ఇక గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ మార్ష్‌లు ఈ మెగా టోర్నీ ఎంతో కీలకం' అని బెయిలీ వెల్లడించాడు.

**రిటైర్మెంట్ యూటర్న్..**

ఈమధ్యే వార్నర్ ఇన్‌స్టాగ్రామ్‌లో రిటైర్మెంట్ యూటర్న్ గురించి పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. అందులో తన పునరాగమనం గురించిన ఆలోచనలు అతడు పంచుకున్నాడు. 'అధ్యాయం ముగిసింది. సుదీర్ఘ సమయం ఓపెనర్‌గా ఆడడం నిజంగా గొప్ప ఫీలింగ్. ఆస్ట్రేలియా నా జట్టు. నా కెరీర్ ఎక్కువగా అంతర్జాతీయ మ్యాచ్‌లకే సరిపోయింది.

## వారిపై వేటు వేయనున్న గంభీర్..!

జింబాబ్వే పర్యటన ముగిసింది. ఇప్పుడు తదుపరి పర్యటన కోసం సిద్ధమైంది. టీమ్ ఇండియా తదుపరి పర్యటన కోసం శ్రీలంక వెళ్లనుంది. జులై 27 నుంచి ప్రారంభం కానున్న ఈ టూర్‌కు సంబంధించి టీమ్ ఇండియాను త్వరలో ప్రకటించవచ్చు. కానీ, అంతకు ముందు ఈ టూర్‌లో జింబాబ్వేలో సిరీస్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన ఆటగాళ్లు ఉంటారా లేదా అనేది తెలియాల్సి ఉంది. జింబాబ్వే టూర్‌లో టీమ్ ఇండియాలో భాగం కాని ఎంతమంది ఆటగాళ్లకు అవకాశం లభిస్తుందనేది కూడా ప్రశ్నగా మారింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా జింబాబ్వేలో పర్యటించింది. జులై 14న ముగిసిన ఈ 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 41 తేడాతో కైవసం చేసుకుంది. గిల్ నేతృత్వంలో భారత్‌కు ఇదే తొలి సిరీస్ విజయం. ఈ సిరీస్‌లో 4 నుంచి 5గురు భారత ఆటగాళ్లు అరంగేట్రం చేశారు. ఈ పర్యటనలో అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, తుషార్ దేశ్‌పాండే అంతర్జాతీయ అరంగేట్రం చేయగా, ధ్రువ్ జురైల్ టీ20 అరంగేట్రం చేశాడు. ఓవరాల్ గా జింబాబ్వే టూర్ కు వెళ్లిన టీమ్ ఇండియాలో చాలా మంది ఆటగాళ్లు కొత్తవారే. లేదా అంతర్జాతీయ క్రికెట్‌కు పెద్దగా పరిచయం లేని వారు ఉన్నారు.

**శ్రీలంక పర్యటనలో కెప్టెన్ ఎవరు?**

ఇప్పుడు శ్రీలంక టూర్ టీమ్ ఎలా ఉంటుందన్నదే ప్రశ్నగా మారింది. భారత సెలక్టర్లతో పాటు, ఈ ప్రశ్నకు సమాధానం కొత్త ప్రధాన కోచ్ గౌతం గంభీర్‌పై కూడా చాలా వరకు ఆధారపడి ఉంటుంది. శ్రీలంక టూర్ నుంచి గంభీర్ టీమిండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నాడు. శ్రీలంక పర్యటనలో భారత్ మూడు వన్డేలు, టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. రోహిత్ రిటైర్మెంట్ తర్వాత ఇప్పుడు టీ20 సిరీస్‌లో హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. అదే సమయంలో వన్డే సారథ్య బాధ్యతలు ఎవరు చేపడతారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఎందుకంటే శ్రీలంక టూర్‌లో రోహిత్ జట్టులో ఉండడు. అతని స్థానంలో ఎవరిని తీసుకుంటారనే దానిపై కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మధ్య ప్రశ్న నెలకొంది.




# టీ20 క్రికెట్‌లో టీమిండియా సరికొత్త చరిత్ర

## పాకిస్థాన్ రికార్డు బ్రేక్.. ఇండియాకు ఎదురే లేదు



**విశ్వంభర, ఢిల్లీ:** టీ20 సిరీస్‌లో చివరి మ్యాచ్ జింబాబ్వే వర్సెస్ భారతదేశం మధ్య ఈరోజు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగింది. 5వ మ్యాచ్‌లో 42 పరుగుల తేడాతో విజయం సాధించిన టీమిండియా 41తో సిరీస్‌ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో పాక్ జట్టు పేరిట ఉన్న భారీ రికార్డును భారత జట్టు వెనక్కి నెట్టింది. విదేశీ పిచ్‌లపై అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా టీమిండియా రికార్డు సృష్టించింది. ఇంతకుముందు ఈ రికార్డు విదేశీ మైదానాల్లో 50 విజయాలు సాధించిన పాకిస్థాన్ పేరిట ఉండగా, ఇప్పుడు జింబాబ్వేను ఓడించి టీమిండియా విదేశీ మైదానంలో 51వ విజయాన్ని సాధించింది. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన భారత జట్టు ఆ తర్వాత వరుసగా 4 మ్యాచ్‌లు గెలిచి శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.

**విదేశీ గడ్డపై అత్యధిక విజయాలు సాధించిన 3 జట్లు..**

**ఆస్ట్రేలియా:**

ఈ జాబితాలో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు విదేశీ గడ్డపై 39 విజయాలతో మూడో స్థానంలో ఉంది. విదేశీ పర్యటనల్లో ఆస్ట్రేలియా ఇప్పటివరకు 79 మ్యాచ్‌లు ఆడగా, అందులో 39 విజయాలు సాధించింది. ఈ ఏడాది ఇంగ్లిష్ గడ్డపై ఆస్ట్రేలియా జట్టు 3 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడనుంది. ఇలాంటి పరిస్థితుల్లో కంగారూ జట్టు తన రికార్డును మరింత మెరుగుపరుచుకోవాలనుకుంటోంది.

**పాకిస్తాన్:**

విదేశీ గడ్డపై పాకిస్థాన్ జట్టు 50 విజయాలు సాధించింది. 95 మ్యాచ్‌ల్లో ఈ ఘనత సాధించాడు. ఆస్ట్రేలియా, జింబాబ్వే, దక్షిణాఫ్రికా పర్యటనలో పాకిస్థాన్ జట్టు ఈ ఏడాది మొత్తం 9 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను ఓడించి మళ్లీ ఈ రికార్డును గెలుచుకోవాలని పాక్ జట్టు భావిస్తోంది.

**టీమ్ ఇండియా:**

జింబాబ్వేను 41తో ఓడించి విదేశీ గడ్డపై అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా టీమిండియా రికార్డు సృష్టించింది. 82 మ్యాచ్‌ల్లో భారత జట్టు 51వ విజయం సాధించింది. ఈ నెలాఖరులో శ్రీలంక పర్యటనలో 3 టీ20 మ్యాచ్‌లు ఆడనున్న భారత జట్టు, ఏడాది చివర్లో జరిగే దక్షిణాఫ్రికా పర్యటనలో 4 మ్యాచ్‌ల్లో పాల్గొంటుంది. ఈ రికార్డులో అగ్రస్థానంలో నిలిచేందుకు భారత జట్టుకు 7 అవకాశాలు ఉంటాయి.

## బీసీసీఐకి పాకిస్థాన్ కండీషన్





ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు పాకిస్తాన్‌లో నిర్వహించాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి ఆతిథ్యం పాకిస్థాన్‌కు దక్కినందున, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో పర్యటిస్తుందా లేదా అన్నది అతిపెద్ద సమస్యగా మారింది. అయితే దౌత్యపరమైన కారణాలతో భారత జట్టు ప్రయాణించే అవకాశం ఎక్కువగా ఉంది. రాజకీయ సంబంధాల కారణంగా పాకిస్థాన్‌కు వెళ్లకపోవచ్చని అంతా భావిస్తున్నారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది భారత ప్రభుత్వం మాత్రమే. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. ఒకవేళ భారత్ పాకిస్థాన్‌కు వెళ్లకపోతే, హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించవచ్చు. అయితే, మొత్తం టోర్నీని తమ దేశంలోనే నిర్వహించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భావిస్తోంది. పాకిస్తాన్ మీడియా నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లో ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చే తన వైఖరి నుంచి పీసీబీ వెనక్కి తగ్గదు. ఈ వారం శ్రీలంకలో జరిగే ఐసీసీ సమావేశంలో బోర్డు అదే స్టాండ్‌లో ఉంటుంది.

**టీ20 ప్రపంచకప్ బహిష్కరించనున్న పాక్..**

ఐసీసీ బోర్డు సమావేశం జులై 19 నుంచి 22 వరకు జరగనుంది. కొలంబోలో జరిగే ఈ సమావేశంలో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ పాల్గొనవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ పాకిస్థాన్‌కు వెళ్లకపోతే, 2026లో జరిగే టీ20 ప్రపంచ కప్‌ను బహిష్కరిస్తామని కూడా నివేదిక పేర్కొంది. టీ20 ప్రపంచ కప్ 2026 భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనుంది. గతేడాది జరిగిన ఆసియా కప్‌కు కూడా భారత్ పాకిస్థాన్ వెళ్లేందుకు నిరాకరించింది. దీని తరువాత, పీసీబీ ఆసియా కప్‌ను 'హైబ్రిడ్ మోడల్' కింద నిర్వహించవలసి వచ్చింది. ఇప్పుడు ఆసియా కప్ 2023 లాగా ఈ టోర్నీని కూడా 'హైబ్రిడ్ మోడల్'లో నిర్వహించాల్సి వస్తుందని పాకిస్థాన్ భయపడుతోంది. భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకపోతే, ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌లను యూఏఈ లేదా శ్రీలంకకు మార్చవచ్చు. ICC బోర్డు సమావేశాలలో, ప్రతి సభ్యుడు ఓటింగ్ వేసి తమ సమస్యను లేవనెత్తవచ్చు. అయితే సభ్య దేశ ప్రభుత్వం అక్కడ ఆడలేమని చెబితే ఐసీసీ ప్రత్యామ్నాయాలను వెతకాల్సి ఉంటుంది. గతేడాది ఆసియా కప్ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా పాకిస్థాన్ వెళ్లారు. ఈ క్రమంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.

**షెడ్యూల్‌ను సిద్ధం చేసిన పీసీబీ..**

ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను పీసీబీ సిద్ధం చేసి ఐసీసీ, దాని సభ్య దేశాల ఆమోదం కోసం పంపింది. అన్ని చోట్ల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత విడుదల చేయనున్నారు. అయితే అంతకుముందే ఈ షెడ్యూల్ వైరల్‌గా మారింది. దీని ప్రకారం, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19న కరాచీలో ప్రారంభమవుతుంది. పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఓపెనింగ్ మ్యాచ్ జరగనుంది. అలాగే షెడ్యూల్ ప్రకారం భారత్, పాకిస్థాన్ లను ఒకే గ్రూపులో ఉంచారు. మార్చి 1న లాహోర్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరగనుంది. లాహోర్‌లో భారతదేశం అన్ని మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపింది. ఇంత జరిగినా, భారత పర్యటనపై బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియా పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం చాలా తక్కువగా ఉందని, అయితే ఈ విషయంలో చివరి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని బీసీసీఐ తెలిపింది. భారత జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్‌లో పర్యటించింది. ఆ తర్వాత మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలో టీమిండియా పాక్ టూర్‌లో ఆసియా కప్ ఆడింది.

# యూపీఐతో రాంగ్ పేమెంట్స్ చేశారా.. కంగారొద్దు

## ఇలా చేయండి చాలు.. ఈజీగా తిరిగి వచ్చేస్తాయి

**విశ్వంభర, బిజినెస్:** నేటి డిజిటల్ యుగంలో ప్రతి పనీ ఆన్ లైన్ లో చాలా సులువుగా జరుగుతోంది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక అనేక వెసులుబాట్లు కల్పించింది. టెక్నాలజీని ఉపయోగించుకుని చాలా వేగంగా లావాదేవీలు పూర్తి చేసుకోవచ్చు. ప్రధానంగా యూపీఐ లావాదేవీలు ప్రజలకు బాగా అందుబాటులోకి వచ్చాయి. ఏమి కొన్నాలన్నా, తినాలన్నా, వేరొకరికి డబ్బులు పంపించాలన్నా యూపీఐ ద్వారా క్షణాల్లో జరిగిపోతోంది. స్మార్ట్ ఫోన్ తో పాటు బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే లావాదేవీలన్ని నిర్వహించవచ్చు.

**కంగారొద్దు..**

యూపీఐ ద్వారా పొరపాటును వేరొకరికి డబ్బులు పంపినా కంగారు పడకూడదు. కొన్ని పద్ధతులు పాటించి మన సొమ్మును వెనకకు రప్పించుకోవచ్చు. దానికోసం ఈ కింద తెలిపిన విధానాలను అనుసరించాలి. ముందుగా యూపీఐ లావాదేవీలో పొరపాటు ఎక్కడ జరిగిందో నిర్ధారణ చేసుకోవాలి. మీరు నంబర్ తప్పుగా ఎంటర్ చేయవచ్చు. పంపిన మొత్తం తప్పు కావచ్చు. లేదా క్యూఆర్ కోడ్ వల్ల పొరపాటు జరగవచ్చు. ఏ విషయంలో తప్పు జరిగిందో ముందు గమనించాలి. మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు పొరపాటున డబ్బు పంపినప్పుడు తిరిగి పొందడం సులభం. కానీ మీకు తెలియని వ్యక్తికి మీరు డబ్బు పంపినప్పుడు, అతడు వెనక్క ఇవ్వడానికి ఒప్పుకోనప్పుడు ఈ కింద పద్ధతులు పాటించాలి.


- నేరుగా బ్యాంక్‌ని సంప్రదించాలి. తప్పు క్రెడిట్ ఛార్జ్ బ్యాక్ కోసం అభ్యర్థనను అందజేయాలి.
- లావాదేవీకి సంబంధించిన యూటీఆర్ వివరాలు బ్యాంకు అధికారులకు తెలియజేయాలి.
- మీరు డబ్బు పంపిన వ్యక్తి కూడా అదే బ్యాంక్‌లో ఖాతాను కంటే.. మీ బ్యాంక్ నేరుగా అతనితో సంప్రదింపులు జరుపుతారు.
- ఒకవేళ ఆ వ్యక్తి వేరే బ్యాంకు ఖాతాదారుడైతే అతడి వివరాలు మాత్రమే అందజేస్తారు. మీరు వాటిని తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లాలి.
- ఆ వ్యక్తి (రిసీవర్) అంగీకరిస్తే డబ్బు వెనుకకు వస్తుంది. ఇందుకోసం సుమారు 7 రోజులు పడుతుంది.
- కానీ రిసీవర్ తిరస్కరించినా, బ్యాంక్ మీకు సహాయం చేయకపోయినా మీరు npci.org.inలో ఫిర్యాదు చేయాలి.
- ఆ ఫిర్యాదు పంపిన తర్వాత 30 రోజులకు మించి ఎటువంటి చర్య తీసుకోనట్లు కనిపిస్తే, మీరు బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి, సమస్యను పరిష్కరించవచ్చు.

**బ్యాంకుల దర్యాప్తు..**

- యూపీఐ తప్పు లావాదేవీపై మీరు ఫిర్యాదు అందించిన తర్వాత బ్యాంకులు వెంటనే చర్యలు ప్రారంభిస్తున్నాయి. మీకు న్యాయం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాయి. అయితే సమస్య పరిష్కారం కావడానికి రిసీవర్ సహకారం చాలా అవసరం.

**ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో..**

- ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో మీ యూపీఐ లావాదేవీ తప్పుగా జరిగితే ఈ విధంగా చర్యలు తీసుకోవాలి.
- ఫోన్‌లో ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్‌ను తెరవాలి.
- సహాయ ట్యాబ్‌పై క్లిక్ చేయండి.
- సహాయం కోసం చాట్‌బాట్‌ని అడగండి.
- అవసరమైన సమాచారాన్ని నమోదు చేయండి.




**పొరపాటు జరిగితే..**

**యూపీఐ ద్వారా డబ్బులు పంపేటప్పుడు కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతాయి. నంబర్ ఏమాత్రం తప్పుగా కొట్టిన మనం పంపాల్సిన వారికి కాకుండా వేరొకరికి డబ్బులు వెళ్లిపోతాయి. వాళ్లు మన మిత్రులు, బంధువులు అయితే వెంటనే వెనక్కి వేసేస్తారు. కానీ బయటి వాళ్లు అయ్యి, డబ్బులు వెనకకు పంపడానికి ఇష్టపడకపోతే ఇబ్బంది ఎదురవుతుంది.**

# ఐదేళ్ల ఎఫ్‌డీలపై అత్యధిక వడ్డీలు కావాలా

**అత్యధిక వడ్డీనిచ్చే టాప్ బ్యాంకులు ఇవే..**

**విశ్వంభర, బిజినెస్:** ఫిక్స్‌డ్ డిపాజిట్ అంటే ప్రజలకు అపారమైన నమ్మకం. సురక్షితమైన పెట్టుబడి పథకంగా ప్రజలు దీనిలో పెట్టుబడులు పెడుతుంటారు. దీనిలో స్థిరమైన వడ్డీ రేటుతో పాటు కచ్చితమైన రాబడి వస్తుండటంతో అందరూ వీటివైపు మొగ్గు చూపుతున్నారు. దీనిలో వడ్డీ రేటు కాల వ్యవధిపైన ఆధారపడి ఉంటుంది. ఎక్కువ కాలానికి ఎఫ్ డీ చేసుకుంటే అధిక వడ్డీ అవకాశాన్ని కొన్ని బ్యాంకులు అందిస్తాయి. సాధారణంగా స్వల్పకాలిక బ్యాంక్ ఎఫ్డీ (ఆరు నెలల వరకు)లపై 3 నుంచి 4.5 శాతం మధ్య వడ్డీ రేటును అందిస్తాయి. పదవీకాలం ఒక సంవత్సరం వరకు పొడిగించినప్పుడు, వడ్డీ రేటు 6 శాతానికి పెరుగుతుంది. కాబట్టి, పదవీకాలం పెరిగేకొద్దీ, వడ్డీ రేటు కూడా పైకి పెరుగుతుంది. అదే సమయంలో అన్ని బ్యాంకుల్లో వడ్డీ రేటు ఒకే విధంగా ఉండదు. బ్యాంకులను బట్టి ఈ వడ్డీ రేటు మారుతుంటుంది. ఈ క్రమంలో ఐదు సంవత్సరాల ఎఫ్డీలపై ప్రధాన బ్యాంకులు అందించే వడ్డీ రేట్ల వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

**5-సంవత్సరాల ఎఫ్డీ అత్యధిక వడ్డీని అందిస్తున్న బ్యాంకులు..**

మార్కెట్లో అనేక సంస్థలు ఫిక్స్ డ్ డిపాజిట్లను అందిస్తున్నాయి. ఒక్కో సంస్థలో ఒక్కో రకమైన వడ్డీ రేటు ఉంటుంది. ఇప్పుడు 5సంవత్సరాల ఎఫ్డీ అత్యధిక వడ్డీని అందిస్తున్న టాప్ బ్యాంకుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..



**ఐసీఐసీఐ బ్యాంక్ :** ఐసిఐసిఐ బ్యాంక్ సాధారణ పౌరులకు ఐదు సంవత్సరాల పదవీకాలంపై 7 శాతం వడ్డీని అందిస్తోంది. సీనియర్ సిటిజన్లు తమ ఐదేళ్ల ఎఫ్డీలో 7.5 శాతం పొందేందుకు అర్హులు. ఈ రేట్లు జులై 12, 2024 నుంచి అమలులోకి వచ్చాయి.

**హెచ్డీఎఫ్సీ బ్యాంక్ :** ఈ ప్రైవేట్ బ్యాంక్ ఐదు సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7 శాతం వడ్డీని అందిస్తోంది. సీనియర్ సిటిజన్లు అదనంగా 50 బేసిస్ పాయింట్లు పొందేందుకు అర్హులు. ఈ రేట్లు జూన్ 12, 2024 నుంచి అమలులోకి వచ్చాయి.

**కోటక్ మహీంద్రా బ్యాంక్:** కోటక్ మహీంద్రా బ్యాంక్ తన ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై సాధారణ పౌరులకు 6.2 శాతం మరియు సీనియర్ సిటిజన్‌లకు 6.7 శాతం అందిస్తుంది. ఈ రేట్లు జూన్ 14, 2024 నుండి అమల్లోకి వచ్చాయి.

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) :** అతిపెద్ద పబ్లిక్ లెండర్ తన ఐదేళ్ల కాలవ్యవధిలో సాధారణ పౌరులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.5 శాతం అందిస్తోంది. అదే పదవీ కాలానికి సీనియర్ సిటిజన్‌లకు 7.5 శాతం ఆఫర్ చేసింది. ఈ వడ్డీ రేట్లు జూన్ 15, 2024 నుంచి అమల్లోకి వచ్చాయి.

**పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ):** జూన్ 10, 2024 నుంచి అమల్లోకి వచ్చిన వడ్డీ రేట్ల ప్రకారం, ప్రభుత్వ రంగ రుణదాత సాధారణ పౌరులకు ఐదేళ్ల కాలపరిమితిపై 6.5 శాతం అందిస్తోంది, సీనియర్ సిటిజన్‌లు 7 శాతం పొందేందుకు అర్హులు.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ): అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన బీఓబీ ఐదేళ్ల డిపాజిట్లపై 6.5 శాతం అందిస్తోంది. సీనియర్ సిటిజన్‌లకు 7.15 శాతం అందిస్తామని బ్యాంక్ వెబ్‌సైట్ లో కనిపిస్తుంది. రేట్లు జూన్ 12, 2024 నుంచి అమల్లోకి వచ్చాయి.

# దూద్ కప్స్ తయారీతో భారీ లాభాలు

**విశ్వంభర, బిజినెస్:** మారిన ఆర్థిక అవసరలు, పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ప్రస్తుతం రెండు చేతులా సంపాదించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక ఆదాయం సరిపోని పరిస్థితి ఉంది. అదంఉకే చాలా మంది ఇతర ఆదాయల కోసం అన్వేషిస్తున్నారు. ఇందుకోసం వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు వ్యాపారాన్ని చేస్తూ డబ్బులు ఆర్జిస్తున్నారు. ఇక గృహిణిలు కూడా ఇంట్లో ఉంటూనే ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇలాంటి వారి కోసం ఎన్నో వ్యాపారాలు అందుబాటులో ఉన్నాయి. అలాంటి ఒక మంచి బిజినెస్ ఐడియా గురించి ఈరోజు తెలుసుకుందాం. ప్రస్తుతం దూద్ కప్స్‌కు భారీగా డిమాండ్ నెలకొంది. చాలా మంది ఇళ్లలో ప్రతీ రోజూ దూప్ కప్స్‌ను ఉపయోగిస్తున్నారు. పూజ గదిలో కచ్చితంగా దూప్ కప్స్ ఉండే పరిస్థితి ఉంది. మరి డిమాండ్ ఉన్న ఈ దూద్ కప్స్ తయారి వ్యాపారాన్ని ప్రారంభించడం వల్ల మంచి ఆదాయం పొందొచ్చు. ఇంతకీ దూప్ కప్స్ తయారీని ఎలా ప్రారంభించాలి.? ఇందులో లాభాలు ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం.. దూప్ కప్స్ తయారీకి ఒక చిన్న మిషన్‌తో పాటు మూడి సరుకు అవసరపడుతుంది. పొడిలా ఉండే ముడి సరుకును మిషన్‌లో వేసి నొక్కితే దూప్ కప్స్ తయారవుతాయి. అనంతరం అందులో కప్స్‌లో వేసే దూప్‌ను కూడా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దూప్ కప్స్‌లో వదూప్‌ను వేసిన తర్వాత వాటిని మంచి ప్యాకేజీ చేసి విక్రయించుకోవచ్చు. మీ సొంత బ్రాండింగ్‌తో వీటిని ప్యాక్ చేసి అమ్ముకోవచ్చు. ఈ మిషిన్‌కు ఎలాంటి పవర్ కూడా అవసరం లేదు. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో దూప్ కప్స్ ప్యాకెట్ తక్కువలో తక్కువ రూ. 50గా ఉన్నాయి. ఈ వ్యాపారాన్ని ప్రారంభించడం ద్వారా భారీగా లాభాలు ఆర్జించవచ్చు.





## రియల్ ఎస్టేట్ రంగంలోకి దిగిన బిగ్‌బాస్ బ్యూటీ..

బుల్లితెరపై బిగ్‌బాస్ రియాల్టీ షోకు ఉండే క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. సినీ పరిశ్రమలో అవకాశాలు.. పాపులారిటీ పెంచుకోవాలని అనుకునేవాళ్లు చాలా మంది ఈ షోలోకి అడుగుపెడుతుంటారు. తెలుగులో బిగ్‌బాస్ సీజన్ 7లో పాల్గొన్న ఈ నటి ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఒకటి రెండు చిత్రాల్లో హీరోయిన్‌గా చేసినా రాని గుర్తింపు బిగ్‌బాస్ రియాల్టీ షో ద్వారా వచ్చింది. ఇప్పుడా బ్యూటీ తన బర్త్ డే సందర్భంగా కొత్త బిజినెస్ స్టార్ట్ చేసింది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరా అనుకుంటున్నారా..? తనే బిగ్‌బాస్ ఫేమ్ శుభ శ్రీ రాయగురు. సోమవారం శుభ శ్రీ రాయగురు పుట్టినరోజు. ఈ సందర్భంగా శుభశ్రీ తన అభిమానులతో ఓ గుడ్ న్యూస్ షేర్ చేసుకుంది. తాజాగా తను శుభశ్రీ హోమ్స్ పేరిట రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించినట్లు తెలిపింది. అంతేకాకుండా కమర్షియల్ బిల్డింగ్స్, విల్లా, ఇల్లు, ప్లాట్స్ కొనాలనుకుంటే శుభశ్రీ హోమ్స్ సంప్రదించాలంటూ ఓ వీడియోను కూడా షేర్ చేసింది. ప్రస్తుతం శుభ శ్రీ షేర్ చేసిన వీడియోస్ సోషల్ మీడియాలో వైరలవుతుండగా.. బిగ్‌బాస్ సెలబ్రెటీస్, అభిమానులు శుభశ్రీకి కంగ్రాట్స్ తెలుపుతున్నారు. శుభశ్రీ ఒడిశాకు చెందిన అమ్మాయి. న్యాయవిద్యను కంప్లీట్ చేసిన శుభశ్రీ ఆ తర్వాత నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. 2020లో వీఎల్సీసీ ఫెమినా మిస్ ఇండియా ఒడిశా విజేతగా నిలిచింది. 2022లో రుద్రవీణ అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత బిగ్‌బాస్ షో ద్వారా చాలా ఫేమస్ అయ్యింది.

## మహేశ్‌బాబు, రాజమౌళి కాంబో మూవీపై సస్పెన్స్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా ప్లాన్ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ దాదాపు ముగిసిందని టాలీవుడ్ టాక్. సెప్టెంబరులో ఈ సినిమాని సెట్స్‌కి తీసుకెళ్లాలని దర్శకుడు రాజమౌళి ప్లాన్ చేస్తున్నట్లు గతంలోనే వార్తలొచ్చాయి. ఆగస్టులో సెట్ వర్క్ పూర్తి చేసి, సెప్టెంబర్‌లో సినిమా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతుండగా, తాజాగా మరో ఇన్‌ఫర్మేషన్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

**మూడు పార్టులుగా?**

తాజా సమాచారం ప్రకారం మహేశ్‌బాబుతో తీసే సినిమాను మూడు పార్టులుగా తీయాలని దర్శక ధీరుడు రాజమౌళి ప్రతిపాదిస్తున్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. గ్రాఫిక్స్ కు చాలా ఎక్కువ స్కోప్ ఉండే మూవీని మూడు పార్టులుగా తీస్తే బాగా వర్క్ అవుట్ అవుతుందని జక్కన్న భావిస్తున్నాడట.. అయితే మహేశ్ బాబు పార్ట్ 1, పార్ట్ 3లో మాత్రమే ఉంటాడని, పార్ట్ 2లో మాత్రం హాలీవుడ్ స్టార్ చేస్తాడని చెబుతున్నారు. పార్ట్ 3లో మహేశ్, హాలీవుడ్ స్టార్ కలిసి చేస్తారనే ప్రచారం ఇండస్ట్రీలో హల్‌చల్ చేస్తోంది. ఇదే నిజమైతే రాజమౌళి సినిమా మూడు భాగాలలో విజువల్ గ్రాఫిక్స్ వండర్‌గా వుండబోతుందంటున్నారు. ఇక మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుల సెలెక్షన్స్‌ను రాజమౌళి టెస్ట్ షూట్స్ చేస్తున్నాడు. మొత్తానికి మహేశ్ సినిమా మూడు పార్టులుగా ఉంటుందనే సమాచారం టాలీవుడ్‌ను షేక్ చేస్తోంది. బాహుబలి చిత్రాన్ని రెండు పార్టులుగా తీసిన జక్కన్న... ఆ సినిమా నిర్మాణానికి ఐదేళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాను మూడు పార్టులుగా తీస్తానంటే ఎంత టైమ్ పడుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. తన వర్క్‌పై రాజీ పడని రాజమౌళి... మూడు భాగాలుగా సినిమా చేస్తానంటుండటమే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.



## కిరణ్ అబ్బవరం 'క' టీజర్ రిలీజ్..

ఇటీవల కిరణ్ అబ్బవరం 'క' అనే సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో గోపాలకృష్ణ నిర్మాణంలో సుజీత్, సందీప్ ఇద్దరు డైరెక్టర్స్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం నెక్స్ట్ సినిమా 'క' తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ లో బిజీగా ఉంది. తాజాగా 'క' సినిమా టీజర్ రిలీజ్ చేసారు. టీజర్ చూస్తుంటే.. హీరో ఎక్కడ్నుంచో ఓ ఊరికి పోస్ట్ మెన్ గా వచ్చి అక్కడ ఏదో చేస్తున్నాడు, మంచివాడిగా కనిపించే చెడ్డోడు అని ఆసక్తిగా ఉంది. ఇక ఇది పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాగా తెరకెక్కుతుంది. టీజర్ తోనే కిరణ్ అబ్బవరం సినిమాలో మాస్ విశ్వరూపం చూపించబోతున్నాడని తెలుస్తుంది. టీజర్ తో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.



## చరణ్ సినిమాలో సెంటిమెంట్ రిపీట్



ప్రజెంట్ గేమ్ చేంజర్ పనుల్లో ఉన్న రామ్ చరణ్, ప్యారలల్‌గా నెక్స్ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా కంప్లీట్ చేస్తున్నారు. ఉప్పెన ఫేం బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం హిట్ సెంటిమెంట్స్‌ను రిపీట్ చేస్తున్నారు. ఫస్ట్ మూవీతోనే 100 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బుచ్చిబాబు, రెండో సినిమానే పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందిస్తున్నారు. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా తన కెరీర్‌లో మరో మైల్ స్టోన్ అంటున్నారు చెర్రీ. అందుకే ఈ సినిమా కోసం ఓ హిట్ స్టార్‌ను రంగంలోకి దించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ సౌత్ సినిమాలకు సూపర్ హిట్ గెస్ట్‌గా మారారు. ఆయన మరో హీరో సినిమాలో కనిపిస్తే చాలు ఆ సినిమా బ్లాక్ బస్టర్ కావటం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. గతంలో బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన గౌతమీ పుత్ర శాతకర్ణి సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపించిన శివరాజ్‌కుమార్. ఆ సినిమా మంచి విజయం సాధించింది. రజనీకాంత్ జైలర్ సినిమాలోనూ గెస్ట్ రోల్ చేశారు శివన్న. ఈ మూవీ అయితే ఆల్ టైమ్ రికార్డ్స్‌ను బ్రేక్ చేసింది. హీరోగా రజనీ ఎంతగా మెప్పించారు, జస్ట్ కొన్ని నిమిషాల స్క్రీన్ ప్రెజెన్స్‌తోనే శివన్న కూడా అదే స్థాయిలో మెప్పించారు. రీసెంట్‌గా ధనుష్ హీరోగా తెరకెక్కిన కెప్టెన్ మిల్లర్ సక్సెస్‌లోనూ శివరాజ్‌కుమార్ క్యారెక్టర్ కీ రోల్ ప్లే చేసింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో ఉద్యమ కారుడిగా శివన్న నటనకు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఇప్పుడు ఆయన రామ్ చరణ్ మూవీలోనూ నటిస్తుండటంతో ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ అవ్వటం పక్కా అంటున్నారు ఫ్యాన్స్.

## అనసూయ గ్లామర్ విందు

అందాల యాంకరమ్మ అనసూయకు ఉన్న కేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాంకర్ గా కెరీర్ మొదలు పెట్టిన ఈ అమ్మడు జబర్దస్త్ తో ఫుల్ క్రేజ్ సొంతం చేసుకుంది. టీవీ షోల్లో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకుంది అనసూయ. తన అందంతో కుర్రకారును కట్టిపడేసింది. ఇక ఈ అమ్మడు సినిమాల్లోనూ రాణిస్తుంది. రంగస్థలం సినిమా అనసూయ డిమాండ్ పెంచేసింది. ఈ సినిమాలో రంగమ్మత్తగా ఆమె చేసిన పాత్ర అంత ఈజీగా ఎవ్వరూ మరిచిపోరు. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారింది. ఓ వైపు సినిమాలు మరోవైపు టీవీ షోల్లో కనిపిస్తూ ఆకట్టుకుంటుంది అనసూయ. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ బ్యూటీ. 0తన సినిమాలు, షోల అప్డేట్స్ తో పాటు అందమైన ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఉంటుంది అనసూయ. ప్రస్తుతం పుష్ప 2 సినిమాలో కీలక పాత్రలో కనిపించనుంది. ఇదిలా ఉంటే తాజాగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు పంచుకుంది. తాజాగా చీరలో వయ్యారాలు ఒలకబోస్తూ కొన్ని ఫోటోలు వదిలింది అనసూయ. ఈ ఫొటోల్లో క్రేజీ స్టిల్స్ ఇచ్చింది ఈ అమ్మడు. ఈ ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ఆషాఢంలో టూర్‌కు వెళ్తున్నారా?

## కొత్తగా పెళ్లయిన జంటలను ఆకట్టుకునే పర్యాటక ప్రదేశాలు చూశారా..?

ప్రస్తుతం తెలుగు క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసం స్టార్ట్ అయ్యింది. ఈ నెల అంటే కొత్తగా పెళ్లయిన జంటలకు అస్సలు నచ్చదు. పెళ్లయిన మొదటి ఏడాది వచ్చే ఆషాఢ మాసంలో కచ్చితంగా భార్య పుట్టింటికి వెళ్లిపోతుంది. ముఖ్యంగా వ్యవసాయం పనులకు మగవాళ్లు వెళ్లరనే ఉద్దేశంతో ఈ ఆనవాయితీ తీసుకొచ్చారని పలువురు ప్రవచనకారులు చెబుతూ ఉంటారు. అయితే ఆనవాయితీలకు కచ్చితంగా పాటించే తెలుగు రాష్ట్ర ప్రజలు వ్యవసాయం చేసినా.. చేయకపోయినా కచ్చితంగా ఆషాఢమాసం భార్యాభర్తలను దూరంగా ఉంచుతారు. అయితే ఈ నెలలో కొంతమంది హనీమూన్ ప్లాన్ చేస్తూ ఉంటారు. కాబట్టి ఆషాఢమాసంలో కొత్తగా పెళ్లయిన జంటలు హ్యాపీగా ఎంజాయ్ చేయడానికి మంచి పర్యాటక ప్రదేశాల గురించి తెలుసుకుందాం.

-విశ్వంభర, ఫీచర్ :

### ఉదయపూర్

వర్షాల సమయంలో ఉదయపూర్ అందాలను మనల్ని మంత్రముగ్దులను చేస్తుంది. ఉదయపూర్ దేశంలోనే అత్యుత్తమ రొమాంటిక్ డెస్టినేషన్‌గా పరిగణిస్తారు. వర్షాకాలంలో ఈ నగరం అందం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. స్థానిక జంటలే కాకుండా విదేశీ జంటలు కూడా ఉదయపూర్‌కు రాచరిక ఆతిథ్యాన్ని ఆస్వాదించడానికి చేరుకుంటారు. ఉదయపూర్‌లో మీరు మీ భాగస్వామితో కలిసి ఫతేసాగర్ లేక్, పిచోలా లేక్, లేక్ ప్యాలెస్, సిటీ ప్యాలెస్ వంటి శృంగార ప్రదేశాలను సందర్శించవచ్చు.




### కుమరకోమ్



కేరళలోని కుమరకోమ్ దక్షిణ భారతదేశంలోని టాప్ రొమాంటిక్ ప్రదేశాల్లో ఒకటిగా పరిగణిస్తారు. బ్యాక్ వాటర్స్, రొమాంటిక్ రిసార్ట్‌లు, రుచికరమైన స్థానిక వంటకాలకు ప్రసిద్ధి చెందింది. చాలా మంది జంటలు తమ హనీమూన్ జరుపుకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ మీరు వెంబనాడ్ సరస్సు, కుమరకోమ్ పక్షుల అభయారణ్యం, కుమరకోమ్ బ్యాక్ వాటర్స్ ఆకట్టుకుంటాయి.

### పచ్మర్హి



మధ్యప్రదేశ్‌లో పచ్మర్హి కొత్తగా పెళ్లయిన జంటలను అమితంగా ఆకట్టుకుంటుంది. వర్షం పడినప్పుడు ఈ ప్రదేశం వేలాది జంటలను ఆకర్షిస్తాయి. ఈ అందమైన హిల్‌స్టేషన్ సరస్సు, జలపాతాలకు కూడా ప్రసిద్ధి చెందింది. పచ్మర్హిలో, బీ ఫాల్, అప్సర విహార్, పాండవ్ గుహ, ప్రియదర్శిని పాయింట్ వంటి ప్రదేశాలను అమితంగా ఆకట్టుకుంటాయి.

### ముస్సోరీ



ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ ప్రాంతం అందమైన హిల్‌స్టేషన్‌గా ఉంది. వర్షం పడినప్పుడు ఈ ప్రదేశాలు చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి. ఇక్కడ సరస్సులు వాటి అందాలు మరింత రెట్టింపు చేస్తాయి. ముస్సోరీలో మీరు కెంప్టీ ఫాల్స్, గన్ హిల్స్, లేక్ మిస్ట్ వంటి అద్భుతమైన ప్రదేశాలను ఆశ్వాదించవచ్చు.



### లోనావాలా

మహారాష్ట్రలో సందర్శించడానికి చాలా అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. అయితే ఈ నెలలో మీ భాగస్వామితో కలిసి సందర్శించాలని ప్లాన్ చేస్తే లోనావాలా మిమ్మల్ని అమితంగా ఆకట్టుకుంటుంది. లోనావాలా మహారాష్ట్రలోని అందమైన హిల్ స్టేషన్‌గా ఉంది. ఇక్కడి ప్రకృతి అందాలు జంటలను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఇక్కడికి వెళ్తే జీవితాంతం గుర్తుంచుకునే మెమోరీలను ఆశ్వాదించవచ్చు. రాజ్మాచి పాయింట్, లయన్స్ పాయింట్, లోనావాలా లేక్ వంటి ప్రదేశాల్లో సేదతీరవచ్చు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com